ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, ఏప్రిల్ 29, 2026 | సంపుటి - 22 | సంచిక 210 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


### మహిళా సర్పంచ్‌ల ఫోరం
## రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

**సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్‌ల సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక**




**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం):**

రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం కన్వీనర్ గా శ్రీమతి గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్ ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్ గా ఎన్నుకున్నారు. ఎంబీసీ, సంచార జాతుల సామాజిక నేపథ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుండి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో ▸▸తరువాయి2లో..

# రేషన్ స్మగ్లింగ్ పుల్లు..
# కవచంగా రైస్ మిల్లు

- స్టేట్ టీమ్ పట్టివేత..
- లోకల్ టీమ్ పిట్ట కథ!
- నియంత్రణ పేరుతో డ్రామా
- లొసుగులే పెద్ద ధీమా
- తాడ్లరాంపూర్ కేంద్రంగా దందా

**నిజామాబాద్ ప్రతినిధి,ఏప్రిల్ 28(నినాదం):**

*రాష్ట్ర ప్రభుత్వం పీడీఎస్ అక్రమ రవాణా కోసం ప్రయోగిస్తున్న విధానాలు నటిస్తున్న వాళ్లను నిద్రలేపుతున్నట్లుగా మారాయి. పేదల బియ్యం రకరకాల మార్గాల్లో పక్కదారిపడుతుండగా, మిల్లుల ముసుగులో జరుగుతున్న విధ్వంసమే అగ్రభాగాన నిలుస్తోంది. ఈవిషయంలో ఏకంగా ముఖ్యమంత్రే రంగంలోకి దిగినా కొందరు అధికారుల అండదండలు కల్గిన అక్రమార్కులు లైట్ తీసుకుంటున్నారు.వెరసీ చట్టాల్లోని లొసుగులు సైతం తోడవటంతో అక్రమార్కులతో పాటు అవినీతి అధికారులు హవా సాగిస్తున్నారు. సరిగ్గా ఇలాంటి ఘటనే నిజామాబాద్ జిల్లాలో ఓటి వెలుగుచూసింది.*

### తాడ్లరాంపూర్.. పర్యవేక్షణ పూర్..

జిల్లాలోని యెర్గట్ల మండలం తాడ్లరాంపూర్ లో శ్రీరామ రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో పీడీఎస్ రైస్ తో అక్రమంగా ఉన్న ఓ వాహనాన్ని స్టేట్ సివిల్ టాస్క్ ఫోర్స్ బృందం మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అనంతరం సదరు వాహనాన్ని సమీప పోలీసు ఠాణాకు తరలించి లోకల్ సివిల్ సప్లైస్ బాధ్యులకు సమాచారమిచ్చారు.ఠాణాలో ఉన్న సదరు వాహనానికి పంచనామా నిర్వహించగా అందులో 43.90 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని,దానికి సంబంధించి 6ఏ కేసునమోదుచేస్తామని లోకల్ బాధ్యులు తెలిపారు.



మిల్లులో భారీగా ఉన్న బియ్యం బస్తాల వివరాలు సేకరిస్తున్న చిత్రం



మిల్లులోని బ్లోయెర్లను పరిశీలిస్తున్న డీటీలు



పట్టుకున్న వాహనంతో స్టేట్ సివిల్ టాస్క్ ఫోర్స్ బృందం

### ఇవీ చేపట్టాల్సిన చర్యలు..

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసి రైస్ మిల్లులో నిల్వ లేదా ప్రాసెస్ చేస్తూ పట్టుబడితే అత్యవసర సరుకుల చట్టం 1955 తో పాటు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ కింద తీవ్రమైన నేరంగా పరిగణించాలి. అక్రమ రవాణాలో వాహనం ఉపయోగించినందుకు వాహనం సీజ్ చేయాలి. సాధారణంగా ఐసి యాక్టు 7 కింద కేసు సైతం రిజిష్టర్ చేయాలి. అదేవిధంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు,నిల్వ ప్రాసెస్ చేయడం స్పష్టంగా నిషేధం.అదే జరిగితే సదరు రైస్ మిల్ యజమాని,లేక బాధ్యులపై కేసు నమోదుచేయాలి. ఆ మిల్లులోని మొత్తం బియ్యాన్ని సీజ్ చేసి మిల్లుపైనా కేసునమోదుచేయాలి. తద్వారా భారీ జరిమానా,ఆ మిల్లు లైసెన్స్ రద్దు, లేదా సస్పెన్షన్ వేటు కూడా పడే అవకాశముంటుంది.



### 6ఏ తో పాటు క్రిమినల్ ప్రొసీజర్ కు రాస్తాం

**జిల్లా సివిల్ సప్లై డిటిలు**

పై విషయమై వివరణకోరగా,సాధారణంగా ఇలాంటి కేసుల్లో తాము 6ఏ కేసు నమోదుచేసి,క్రిమినల్ ప్రొసీజర్ సైతం అవలంబించాలని పోలీసులకు రాస్తామన్నారు. కానీ శ్రీ రామ రైస్ ఇండస్ట్రీస్ ఘటనలో పై విధంగా చేయలేమన్నారు. ఉద్దేశపూర్వకంగా లోపలికి రాలేదని,దారితప్పి మాత్రమే వాహనం మిల్లులోకి వచ్చినట్లు సదరు వాహన డ్రైవర్ చెప్పినట్లు సివిల్ సప్లై డిటీలు తెలిపారు. ఆ ప్రకారం మిల్లుపై గానీ,దాని యజమానిపై గానీ సివిల్ సప్లైస్ చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోలేమని వెల్లడించారు.

### ప్రభుత్వ డిజిటల్ ప్రాజెక్ట్
## హ్యాండోవర్‌లో అవరోధం

**పాత విక్రేతపై తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సేవల పంపిణీ (ESD) శాఖ పోలీసులకు ఫిర్యాదు**

**హైదరాబాద్, ఏప్రిల్ 28(నినాదం):**




తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సేవల పంపిణీ (ESD) శాఖ ఒక ముఖ్యమైన ప్రాజెక్ట్ హ్యాండోవర్ ప్రక్రియలో సహకరించని పాత అమలు సంస్థ మెసర్స్ ట్రాన్సాక్షనల్ అనలిస్ట్స్‌పై నేడు పోలీసు ఫిర్యాదు దాఖలు చేసింది. ఈ చర్యతో ప్రభుత్వం పౌర సేవలను దెబ్బతీసే ఏ విక్రేత అవరోధాలనైనా సహించేది లేదని స్పష్టమైన సంకేతం ఇచ్చింది.గత సంవత్సరం ఐటీఈ&సీ శాఖ నిర్వహించిన పోటీ టెండర్ ద్వారా ఈ ప్రాజెక్టును మెసర్స్ ప్యూర్‌వ్యూ సంస్థకు అప్పగించారు. ఒప్పందం ప్రకారం, పాత సంస్థ (మెసర్స్ ట్రాన్సాక్షనల్ అనలిస్ట్స్ – CEO శ్రీనివాస్ ఖత్తూరి నేతృత్వంలో) ప్రాజెక్ట్ డేటా, సోర్స్ కోడ్, కాన్ఫిగరేషన్లు, 2






### మీసేవ వాట్సాప్‌లో
## SSC ఫలితాలు

**ఇంటి నుంచే క్షణాల్లో మార్కులు!**

**హైదరాబాద్, (నినాదం):**

పదో తరగతి విద్యార్థులు, తల్లి దండ్రులకు ఊరట! రేపు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి SSC ఫలితాలు మీ సేవ వాట్సాప్ ద్వారా సులభంగా అందుబాటులోకి వస్తాయి. ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా, సెల్‌ఫోన్‌లోనే క్షణాల్లో మార్కుల మెమోను పొందవచ్చని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ESD) విభాగం, తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌తో సమన్వయం చేసుకుని ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. 2

**ఫలితాలు పొందే విధానం:**

*8096958096 నంబర్‌ను "MeeSeva Telangana" పేరుతో సేవ్ చేసుకోండి. వాట్సాప్‌లో "Hi" అని మెసేజ్ పంపండి. "SSC Result" అని టైప్ చేయండి. మెనులో "Open Service" ఎంచుకోండి. హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి సమర్పించండి. వెంటనే మార్కుల మెమో వాట్సాప్‌లో అందుతుంది.*

### తెలంగాణ డిజిపిగా
## సివి ఆనంద్

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**



**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది.

### రాజ్యాంగపరమైన
## ప్రశ్నలపైనే మాదృష్టి

- ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు
- శబరిమలలో మహిళల ప్రవేశంపై విచారణ
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



2

# ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరం

- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్
- నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన

*ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషి తోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు.*

*రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు.*



2

గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మ దు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని సీఎం చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్లాను.. అందుకే అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు.

### చర్లపల్లి స్టేషన్ వద్ద
## భూమి కేటాయించండి

**సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్, నినాదం:**



ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యాల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5 ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం స్వయంగా వీటిపై దృష్టి సారించాలని కోరారు. 2



### పిల్లలతో ఫుట్‌బాల్
## ఆడిన ప్రధాని

**సిక్కిం ఆవిర్భావ దినోత్సవంగా రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో మోడీ సందడి**

**న్యూఢిల్లీ, నినాదం:**

నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా 2




## గూగుల్ ..ఎపికి గేమ్ ఛేంజర్

- దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది
- గ్రోత్ ఇంజిన్‌గా మారనున్న గూగుల్
- 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి
- ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం
- గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

2

### ప్రపంచానికి సవాల్‌గా మారిన
## ఉగ్రవాదం

**ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి**

**షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్**

2



# హైదరాబాద్‌లో లాంజీన్స్ కొత్త బొటిక్ ప్రారంభం




**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం)**

స్విస్ లగ్జరీ వాచ్ బ్రాండ్ లాంజీన్స్ నగరంలోని ఇనార్బిట్ మాల్‌లో తన రెండవ బ్రాండ్ బొటిక్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని బ్రాండ్ ఫ్రెండ్ సారా అలీ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షోలో ప్రైమలూనా కలెక్షన్‌ను ప్రదర్శించారు. సారా అలీ ఖాన్ ఈ కలెక్షన్‌లోని వాచ్‌ను ధరించి ర్యాంప్‌పై నడిచారు. "సౌందర్యం కాలాతీతం, మార్పుతో కూడుకున్నది" అని ఆమె తెలిపారు. ప్రైమలూనా శ్రేణి సున్నితమైన డిజైన్, మూన్‌ఫేజ్ ఫీచర్లు, నీలిరంగు డయల్ మరియు నీలమణులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ బొటిక్‌లో డోల్చెవిటా, హైడ్రోకాన్క్వెస్ట్, మాస్టర్ కలెక్షన్ వంటి ఇతర వాచ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.










భాగ్యనగర వాసుల్లో ఫిట్ నెస్ పై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ గత 15 ఏళ్ళుగా మారథాన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ తెలిపారు.హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ఈ నెల 28 నుండి మూడు రోజులు పాటు జరగనున్న ఎక్స్ పో , మారథాన్ పోస్టర్ ను సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు . మారథాన్ ద్వారా వచ్చిన ఫండ్ ను ఎన్జీవోలకు , పలు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు . దేశ,విదేశాలకు చెందిన అథ్లెట్లు ఈ మారథాన్ లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**- హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం)**

# టీచర్ల మెడకు అడ్మిషన్ల ఉచ్చు

## ప్రైవేటు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకునేందుకు స్కెచ్

**లక్ష్యాలు చేరితేనే జీతాలు.. లేకుంటే జాబ్ ఊడినట్టేనట..**
**ఇచ్చేదే అరకొర.. ఆపై అనేక కోర్రీలు..**
**వేసవి సెలవుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారంలో బిజీ**
**ఒక్కరికీ 20 నుంచి 30 వరకు టార్గెట్.. అడ్మిషన్‌కు 3వేల వరకు కమీషన్ ఆఫర్లు**
**పని ఒత్తిడితో ప్రయివేటు పంతుళ్లు సతమతం**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్ 28(నినాదం)**

నిన్నటి వరకు తరగతి గదిలో పాఠాలు చెప్పిన చేతులు.. నేడు ఎండలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతున్నాయి. 'అమ్మో.. అడ్మిషన్లు' అంటూ ప్రైవేటు టీచర్లు బెంబేలెత్తిపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పంతుళ్ల పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులను, ప్రైవేటు యాజమాన్యాలు 'సేల్స్ మెన'లుగా మార్చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇచ్చే అరకొర వేతనాల్లో అనేక కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నా, అధనంగా పాఠశాల యాజమాన్యాలు విధిస్తున్న అడ్మిషన్ల టార్గెట్‌లో పడి సతమతమవుతున్నారు. కొన్ని యాజమాన్యాలు వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త అడ్మిషన్లు తీసుకురావాలని ఒత్తిడి చేస్తుండడంతో పాటు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయకుంటే జాబ్‌కు ఊడిపోతాయంటూ హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మరికొన్ని యాజమాన్యాలు ఒక్కో అడ్మీషన్‌కు కమీషన్లు ఇస్తుండడంతో పాటు జీతాలు సైతం పెంచుతామంటూ హామీలు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

**కమీషన్ల ఎర.. ఒత్తిడి సెగ**

మరికొన్ని ప్రయివేటు యాజమాన్యాలు టీచర్లను ప్రలోభపెట్టడానికి 'కమీషన' పద్ధతిని తెరపైకి తెచ్చాయన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. "ఒక్క విద్యార్థిని జాయిన్ చేస్తే 2వేల నుంచి 3వేల వరకు కమీషన్ ఇస్తా మంటూ ఆశ చూపిస్తున్నాయన్న వార్తలు వినవస్తున్నాయి. అయితే, ఈ టార్గెట్ పూర్తి చేయలేకపోతే వచ్చే విద్యా సంవత్సరంలో ఉద్యోగం ఉండదని పరోక్షంగా హెచ్చరిస్తుండటంతో టీచర్లు మానసిక వేదనకు గురవుతున్నారు." బోధనపై పెట్టాల్సిన దృష్టిని మార్కెటింగ్ మీద పెట్టాల్సి రావడంపై మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను బ్రతిమాలడం, ఫోన్ కాల్స్ చేయడం వంటి పనులతో టీచర్లు విసిగిపోతున్నారు. విద్యావంతులైన టీచర్లు ఇలా వీధుల వెంట తిరిగి మార్కెటింగ్ చేయడం వల్ల సమాజంలో తమ గౌరవం తగ్గుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టార్గెట్లు రీచ్ అవ్వకపోతే ఉద్వాసనే!**

జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు టీచర్లకు వింత నిబంధనలు విధిస్తున్నాయి. కేవలం బోధన బాధ్యతలే కాకుండా, కొత్త విద్యార్థులను చేర్పించడం ప్రాధాన్యతగా మారింది. ఒక్కో టీచర్‌కు 20 నుంచి 30 అడ్మిషన్లు చేయాలనే లక్ష్యం. అడ్మిషన్లు చేస్తేనే జీతాల పెంపు, లేదంటే ఉన్న ఉద్యోగానికే ఎసరు పెట్టే పరిస్థితి నెలకొందన్న వార్తలు వినిపిస్తున్నాయి. సెలవుల్లో విశ్రాంతి తీసుకోవాల్సిన టీచర్లు, మండుటెండల్లో కాలనీల వెంట తిరుగుతూ అడ్మిషన్ల కోసం ప్రచారం చేయాల్సి వస్తోంది. తెలిసిన వారికి ఫోన్లలో సంప్రదింపులు చేస్తూ ఉన్న జాబ్‌లు కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

**అగమ్యగోచరంగా పంతుళ్ల పరిస్థితి..**

ఎంఈడి, బిఈడి, డబుల్ పీజీలు చేసిన ఈ పంతుళ్లకు వచ్చే జీతం మాత్రం నెలకు 10వేల నుంచి 15వేల వరకు మాత్రమే ఉంటుంది. అయినా కానీ నచ్చిన టీచర్ ఉద్యోగం చేయాలన్న ఆశతో కొందరు, కుటుంబ పోషణ కోసం మరికొందరు ప్రయివేటు స్కూళ్లలో టీచర్లుగా పని చేస్తున్నారు. అయితే చదువు చెప్పే గురువులను కార్పొరేట్ శైలిలో టార్గెట్లతో వేధించడం విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారుతోంది. విద్యా ప్రమాణాలను పెంచి అడ్మిషన్లు పెంచుకోవాలి కానీ, ఇలా టీచర్లపై ఒత్తిడి తెచ్చి విద్యార్థులను చేర్చుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై స్పందించి, ప్రైవేటు టీచర్ల హక్కులను కాపాడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.



# నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం):**

మంగళవారం నిర్మల్ జిల్లాకు నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన భవేష్ మిశ్రాకు కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ,ఎఎంసి చైర్మన్ సోమ భీంరెడ్డి, సారంగాపూర్ ఎఎంసి చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ని శాలువ తో సత్కరించి పుష్పగుచ్ఛ న్నీ అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు.

## మంత్రి ఉత్తమ్‌ను విమర్శించే అర్హత ఒంటెద్దు నరసింహారెడ్డికి లేదు

### గరిడేపల్లి సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామంజిగౌడ్

**హుజూర్ నగర్, ఏప్రిల్ 28 (నినాదం):**



మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని విమర్శించే అర్హత ఒంటెద్దు నరసింహారెడ్డి నీకు లేదని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గుండు రామంజిగౌడ్ అన్నారు. నియోజకవర్గ ఇన్చార్జిగా ఉండి మూడు నెలలకు ఒకసారి హుజూర్నగర్ వచ్చి ప్రెస్ మీట్ లు పెట్టడం ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప నీవల్ల టీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలకు ఒరిగింది ఏమీ లేదని నీ పనితనం ఏంటో మొన్న మున్సిపాలిటీ ఎన్నికల్లోనే తెలిసిందని నువ్వు ఒక బీఆర్ఎస్ నాయకునివా లేక బ్రో కరువా మంత్రిని విమర్శించే స్థాయా నీది కాదు అనీ ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు లేదంటే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుంది అని మచ్చలేని మా నాయకుని మీదనా నువ్వు మాట్లాడేది కనీసం జనక్షేత్రంలో వార్డు నెంబర్ గా కూడా గెలవలేనోనివీ నువ్వు మంత్రి ఉత్తమ్ వేలకోట్లు తీసుకొచ్చి హుజూర్నగర్ నియోజకవర్గాన్ని కనీ విని ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తుంటే నీ కండ్లకు కనబడటం లేదా చెవులు వినపడటం లేదా వందల కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ను ఎర్రగట్టు దగ్గర వ్యవసాయ క్షేత్రం అయితే నేమి మన రామస్వామి గుట్ట దగ్గర 2160 ఇండ్లు ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇస్తున్నారంటే మేము ధైర్యంగా చెప్తున్నాం మా ఉత్తమ కుమార్ రెడ్డి సలవే అని ఈరోజు ప్రతి ఇంట్లో సన్నబియ్యం ఇస్తున్నారంటే అది కేవలం మా ఉత్తమ్ అన్న సలవే ప్రతి ఒక్క పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడాలని మా ఉత్తమన్న తపన ఇంకా చెప్పుకుంటు పోతే వందల కోట్లుతో హుజూర్నగర్ నియోజకవర్గాన్ని ప్రతి విలేజ్ లోసిసి రోడ్లు డ్రైనేజీలు స్కూల్ బిల్డింగులు గ్రామపంచాయతీ బిల్డింగులు ఎస్సీ కమిటీ హాల్ మెయిన్ ఊర్లలో సబ్స్టేషన్ను గ్రంథాలయాలు వెటర్నరీ హాస్పిటల్స్ ఇంకా హుజూర్నగర్ గవర్నమెంట్ హాస్పిటల్ 50 కోట్లతో మిషన్స్ తీసుకొచ్చి సుందరీకరణంగా తీర్చి దిద్దిండు అది నీకు కనపడట్లేదా ఏ ఊరికి ఏమి అభివృద్ధి కావాలన్నా చేస్తుంటే ఇంకా మాకేం కావాలి !నరసింహారెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు నరిసింహారెడ్డి నువ్వు మాట్లాడిన మాటలు బేసరతుగా వెనుకకీ తీసుకొని క్షమాపణ చెప్పాలి లేదంటే నీకు తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుంది గుర్తు పెట్టుకో తర్వాత జరిగే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి నరసింహారెడ్డి ఏదైనా ఆలోచించి మాట్లాడటం నేర్చుకో అసలు అక్రమ సంపాదన అంటున్నావ్ రుజువు చేస్తావా మా నాయకుడి మీద మేము బహిరంగ చర్చకు వస్తాం టైం , ప్లేస్, డేట్ నువ్వే చెప్పు ఎప్పుడైనా ఎక్కడైనా రడీ గుర్తుపెట్టుకో నీకిది ఫస్ట్ అండ్ లాస్ట్ చెప్పేది తర్వాత నీ ఇష్టం అని హెచ్చరించారు.



## విద్యార్థినిని అభినందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం)**

వనపర్తి పట్టణంలోని 30వ వార్డు న్యూ నంది హిల్స్ కాలనీకి చెందిన కేతావత్ పల్లవి, జానయ్య కుమార్తె కె.భవిత ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపులో 440 మార్కులకు గాను 437 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించారు. మాజీ మంత్రి వెంట జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి, శ్రీకర్ గౌడ్, నాయకులు మంద రాము, ముద్దుసార్, అలీమ్, తోట శీను, వంశీ, రాహుల్ తదితరులు ఉన్నారు

## రూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ ప్రతినిధి, సారంగాపూర్ఏ ప్రిల్ 28 (నినాదం):**



సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన క్యాతమ్ పెద్ద పర్వన్న కు అనారోగ్య కారణంగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కును బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు.

## శాస్త్రవేత్తలు చెప్పిన మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందండి





### వ్యవసాయ శాస్త్రవేత్తలు

**మునుగోడు, ఏప్రిల్ 28 (నినాదం):**

మునుగోడు మండల కేంద్రంలోని రైతు వేదికలో, మంగళవారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించబడింది. రైతులు వానకాలం పంట సాగుకు సన్నద్ధం చేయాలని శాస్త్రవేత్తలు చెప్పిన మెలకువలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కోరారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు డా!! రామకృష్ణ బాబు మాట్లాడుతూ, రైతులకు వచ్చే వానకాలం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు యాజమాన్య పద్ధతులు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల్లో వచ్చే చీడ పీడల నివారణ, సమస్యాత్మక నేలల యాజమాన్య పద్ధతులు గురించి వివరించడం జరిగింది. శాస్త్రవేత్త సాయి ప్రియ మాట్లాడుతూ, అధిక సాంద్రత పత్తి, వాటి యొక్క లాభాలు మరియు యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగింది. మునుగోడు ఏడిఏ మాట్లాడుతూ, పంట మార్పిడి, పురుగు మందుల పిచికారి విధానం గురించి, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి ఎస్ పద్మజ మాట్లాడుతూ, భూమి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని సేంద్రియ వ్యవసాయం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, చల్మెడ గ్రామ సర్పంచి బండిమీద యాదయ్య, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతుల తర్వాత మూసివేయని కాలువ

### రాకపోకలకు ఆటంకం

**పెబ్బేరు ఏప్రిల్ 28 (నినాదం):**

పెబ్బేరు మండలంలో ఇటీవల మరమ్మతుల కోసం కాలువ తవ్విన అధికారులు, పనులు పూర్తయ్యాక తిరిగి కాలువను మూసివేయడం మర్చిపోవడంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించినప్పటికీ, తవ్విన కాలువను అలాగే వదిలేయడం వల్ల రాకపోకలు దెబ్బతిన్నాయి. వారం రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. కాలనీలోని రహదారులపై తవ్విన కాలువ కారణంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల భయం నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువను సమతలపరచి రహదారిని పునరుద్ధరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.









## ఆయిల్ ఫామ్ సాగుతో రైతుకు భద్రత

### రైతులను మోసగించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి: రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**తొర్రూరు, ఏప్రిల్ 28 (నినాదం):**

ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు ఆర్థిక భద్రత లభిస్తుందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు.తొర్రూరు మండలం హరిపిరాల శివారులోని పామాయిల్ నర్సరీలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఫామ్ ఆయిల్ సాగుపై ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్చార్జి సిహెచ్ దయాకర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి తో కలిసి జంగా రాఘవరెడ్డి మాట్లాడారు.పంట మార్పిడి లో భాగంగా ఆయిల్ ఫామ్ సాగు చేసి రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ టన్ను రూ.12వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.23 వేలకు పైగా పెంచామని చెప్పారు. రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని సూచించారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 2.72 లక్షల ఎకరాల్లో 73,696 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగుచేస్తున్నారు. రానున్న మూడేళ్లలో విస్తీర్ణం 10 లక్షల ఎకరాలకు చేరాలన్నారు. కంపెనీలు నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలను రైతులకు అందిస్తున్నాయని తెలిపారు. ఎకరా ఆయిల్పామ్ సాగుకు రూ.50 వేల వరకు మొక్కలు, డ్రిప్పు, పాండ్ నిర్వహణకు వివిధ రకాలుగా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. మూడేళ్లపాటు ఆయిల్పామ్ సాగు చేస్తే.. నాలుగో ఏడాది నుంచి ఆదాయం వస్తుందన్నారు. రైతులందరూ ఆయిల్పామ్ సాగుపై మరింత దృష్టి సారించాలన్నారు. రైతుల సందేహాల నివృత్తి కోసం.. ఆయిల్ ఫెడ్ పరిధిలో సలహా కేంద్రాలు సైతం ఏర్పాటు చేశామని తెలిపారు.టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.... పామ్ ఆయిల్ సాగుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని, రైతులు లాభసాటి పంటలు వేసి ఆదాయం పొందాలని సూచించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తొర్రూర్ లో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఎండి యాస్మిన్ పాషా, ఓపిడి ప్రవీణ్ రెడ్డి, శాస్త్రవేత్తలు సుహాసిని, అధికారులు మరియాన, ఏఎంసీ చైర్మన్ లు తిరుపతిరెడ్డి, లావుడియా మంజుల భాస్కర్, తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ శ్రావణ్ కుమార్, హరిపిరాల సర్పంచ్ స్వాతి రాజు, దుబ్బ తండ సర్పంచ్ విజయ లుంబ, వివిధ గ్రామ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు ప్రక్రియ చేసుకోవాలి





### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం):**

జిల్లా ప్రజలు జనగణన–2027లో భాగంగా నిర్వహిస్తున్న స్వీయ నమోదు ప్రక్రియను తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన–2027, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జనగణన దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, జనాభా గణాంకాల ఆధారంగానే ప్రభుత్వాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ విధానాలను రూపొందిస్తాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా పాల్గొని సరైన సమాచారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో "ఇండ్ల జాబితా, ఇండ్ల గణన (HLO)" కార్యక్రమాన్ని చేపట్టి, మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. రెండో దశ జనాభా గణనను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో ప్రజలకు "సెల్ఫ్ ఎన్యుమరేషన్" సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి కుటుంబ సభ్యుల వివరాలు సహా మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. నమోదు పూర్తైన అనంతరం లభించే 11 అంకెల "SE ID"ను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వీయ నమోదు పూర్తి చేసిన కుటుంబాలు మే 11 తర్వాత ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు SE ID చూపిస్తే సరిపోతుందని, దీంతో గణన ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ జీవరత్నం, డీపీఆర్వో విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలతో

# రైతుల గుండెల్లో రైళ్లు !

సంపాదకీయం

రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మ డు పంటలు పండే, క ష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ వి నమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోవి టర్ల పొడవున 250 వి టర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, క ష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ క□ష్ణానదికి సవి పంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మ డుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 వి టర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 వి టర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివ□ద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సవి కరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన పక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజసమైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివ□ద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సవి□కరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆరఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం క□ష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యాయని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆరఅండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్ఎఐ అధికారులను ఆదేశించింది. అభివ□ద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 వి□టర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది. అలాగే భూములు కావాల్సి వచ్చినప్పుడు బహిరంగ మార్కెట్ ధరలు చెల్లించి సేకరించడం అవసరం. అంతేగానీ రైతులను మహ్య పెట్టి, వారిని కూలీలుగా దిగజార్చే చర్యలు మాత్రం సహించరానివి.

# కోటి ఆశల గణాంకం.. రేపటి ప్రగతికి అంకురార్పణం





### గణాంక విప్లవం: 'స్వీయ గణన'తో సరికొత్త చరిత్రకు శ్రీకారం

**భారతదేశ పరిపాలనా ముఖచిత్రంలో జనగణన అనేది కేవలం అంకెల సమాహారం కాదు; అది ఒక దేశపు గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని అంచనా వేస్తూ, భవిష్యత్తును నిర్మించే అత్యంత శక్తిమంతమైన శాస్త్రీయ ఆయుధం. ఒక దేశ ఆర్థిక పురోగతికి, సామాజిక న్యాయానికి, వనరుల సమతుల్య పంపిణీకి పునాదిగా నిలిచే ఈ ప్రక్రియ, మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిమళాన్ని అద్దుకుంటూ సరికొత్త రూపును సంతరించు కుంటోంది. 1872లో ప్రయోగాత్మక పునాదులతో మొదలై, 1881 నుండి నేటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న ఈ దశాబ్దాల సంప్రదాయం, కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన అనూహ్య విరామం తర్వాత 2027లో సరికొత్త 'డిజిటల్' అధ్యాయాన్ని ప్రారంభించ బోతోంది. ఈ నేపథ్యంలో, 2027 జనగణన అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక విప్లవాత్మక మలుపుగా, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలవనుంది.**

భారతదేశంలో జనగణన చరిత్రను అవలోకనం చేస్తే, బ్రిటీష్ పాలనా కాలంలో లార్డ్ మేయో హయాంలో 1872లో తొలి ప్రయత్నం జరగ్గా, డబ్ల్యూ.డబ్ల్యూ. హంటర్ నేతృత్వంలో 1881లో మొదటి సమగ్ర గణన నిర్వహించ బడింది. నాటి నుండి నేటి వరకు యుద్ధాలు, కరువులు సంభవించినా ఆగని ఈ ప్రక్రియ, 2021లో మాత్రం కరోనా సెకండ్ వేవ్ తీవ్రత కారణంగా వాయిదా పడక తప్పలేదు. దాదాపు 150 ఏళ్ల చరిత్రలో ఇలాంటి విరామం రావడం ఇదే తొలిసారి. అయితే, ఈ ఆలస్యం దేశ ప్రణాళికా రచనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ 2011 గణాంకాలపైనే ఆధారపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సుమారు 15 ఏళ్ల అంతరంలో దేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ వేగం, అక్షరాస్యత నమూనాలు సమూలంగా మారిపోయాయి. అందువల్ల, 2027లో జరగబోయే గణన ఆ పాత వివరాలకు, నేటి వాస్తవాలకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని పూరించే వారధిగా మారుతుంది.

ఈసారి జరగనున్న గణనలో అత్యంత వినూత్నమైన మరియు ప్రతిష్టాత్మకమైన అంశం 'స్వీయ గణన' (Self-Enumeration). డిజిటల్ ఇండియా సఫలీకృత మవుతున్న తరుణంలో, పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య సంస్కరణ. గతంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. దీనివల్ల భాషా సమస్యలు, సమాచార సేకరణలో పొరపాట్లు, సమయభావం వంటి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విప్లవం పుణ్యమా అని, ప్రభుత్వం కేటాయించిన https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, ఆదాయం, నివాస స్థితిగతులను పారదర్శకంగా నమోదు చేయవచ్చు. మే 10వ తేదీ లోపు ఈ స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసి, పొందిన ప్రత్యేక ఐడీని భద్రపరుచు కోవడం ద్వారా, తర్వాత వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి కేవలం ఆ సంఖ్యను చూపిస్తే సరిపోతుంది. ఇది దేశవ్యాప్తంగా లక్షలాది గంటల శ్రమను, కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఆదా చేయడమే కాకుండా, డేటా సేకరణలో ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది.

గణాంక పరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04 శాతం ఉండగా, నేడు అది 80 శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహ నిర్మాణ పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది, తద్వారా రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది.

సాంకేతికతతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. భారతదేశం లాంటి భిన్నత్వంతో కూడిన దేశంలో 'డిజిటల్ విభజన' ఒక ప్రధాన సమస్య. పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికంగా ఉన్నప్పటికీ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో, వెనుకబడిన గ్రామాల్లో ఇంటర్నెట్ లభ్యత, సాంకేతిక అవగాహన తక్కువ. వృద్ధులు, చదువుకోని వారు స్వీయ గణనలో పాల్గొనడం కష్టతరం కావచ్చు. ఇక్కడే ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం కానుంది. స్వీయ గణన అనేది సంప్రదాయ పద్ధతిని పూర్తిగా తొలగించదు, కానీ దానిని సులభతరం చేస్తుంది. ఎవరైతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేరో, వారి వద్దకు సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తారు. అలాగే, సేకరించిన డేటా భద్రత మరియు గోప్యత విషయంలో ప్రజల్లో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం పటిష్టమైన సైబర్ భద్రతా చర్యల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. మరోవైపు, వర్తమాన రాజకీయ సామాజిక కోణంలో 'కుల గణన' డిమాండ్ ఈసారి జనగణనకు మరింత ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. దేశంలోని ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాస్తవ సంఖ్యను తెలుసుకోవడం ద్వారానే 'జనాభా ప్రాతిపదికన వాటా' సాధ్యమని ఒక వర్గం వాదిస్తోంది. స్వతంత్ర భారత చరిత్రలో 1951 నుండి ఇప్పటి వరకు కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే సేకరిస్తున్నారు. ఈసారి కుల గణనను కూడా చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం దేశ సామాజిక గమనాన్ని మార్చివేస్తుంది. వనరుల పంపిణీలో అర్హులైన వారికి ప్రాధాన్యత దక్కాలంటే ఖచ్చితమైన కుల–ఆర్థిక గణాంకాలు అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. జనగణన అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మనం ఇచ్చే ప్రతి చిన్న సమాచారం ఒక పెద్ద జాతీయ విధానానికి రూపకల్పన చేస్తుంది. 2027 జనగణన ద్వారా లభించే డేటా, భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్'గా ఎదగాలన్న లక్ష్యానికి ఇంధనంగా పనిచేస్తుంది.

పౌరులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా ఉంది. ఈ 'స్వీయ గణన' విధానంలో పాల్గొన దలచిన వారు మొదటగా అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి తమ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ కనిపించే క్యాప్చా కోడ్‌ను నమోదు చేసిన తర్వాత, కుటుంబ పెద్ద పేరు మరియు క్రియాశీలకంగా ఉన్న చరవాణి సంఖ్యను అందించాలి. ఇక్కడ పౌరులు ఒక ప్రాథమిక జాగ్రత్త వహించాలి; కుటుంబ పెద్ద పేరు ఒకసారి నమోదు చేసిన తర్వాత మార్చడానికి వీలుండదు. ఈ ప్రాథమిక నమోదు విజయవంతమైన తర్వాత, రెండో విభాగంలో పౌరులు తమకు అనువైన భాషను ఎంచుకోవచ్చు. భాషను ఎంపిక చేసుకోగానే మొబైల్ నెంబర్‌కు ఒక ఓటీపీ అందుతుంది. దానిని నమోదు చేసిన అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం లేదా పట్టణం వంటి భౌగోళిక వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. సాంకేతికతను మరింత సమర్థవంతంగా వాడుతూ, నివాస ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించేందుకు 'రెడ్ మార్కర్' సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా మ్యాప్‌లో మీ నివాసం ఎక్కడ ఉందో క్లిక్ చేసి నిర్ధారించుకోవచ్చు. మూడో విభాగంలో అసలైన గణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇక్కడ కుటుంబ సభ్యుల వివరాలు, వారి విద్య, వృత్తి, ఆదాయం మరియు నివాస స్థితిగతులకు సంబంధించిన సుమారు 33 కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. అన్ని వివరాలు నింపిన తర్వాత 'ప్రివ్యూ' ఆప్షన్ ద్వారా ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి. తప్పులు ఉంటే సవరించుకుని 'ఫైనల్ సబ్మిట్' బటన్ నొక్కాలి. దీనితో మీ సమాచారం సర్వర్‌లో లాక్ అవుతుంది. అనంతరం మొబైల్ మరియు ఈ–మెయిల్‌కు 'H' అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల విశిష్ట ఎస్ఈ ఐడీ (SE ID) అందుతుంది.

ఈ ప్రక్రియ అంతటితో ముగిసి పోదు. నాలుగో విభాగంలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు ఆన్‌లైన్‌లో పొందిన ఎస్ఈ ఐడీని వారికి చూపించాలి. వారు తమ వద్ద ఉన్న డిజిటల్ పరికరాల్లో ఆ ఐడీని నమోదు చేయగానే మీరు ఇచ్చిన వివరాలు కనిపిస్తాయి. మీరు తెలిపిన సమాచారం, వారు ప్రత్యక్షంగా గమనించిన అంశాలు సరిపోలితే ప్రక్రియ ముగుస్తుంది. ఒకవేళ ఏవైనా పొరపాట్లు ఉన్నా లేదా డేటా మ్యాచ్ కాకపోయినా, వారు తిరిగి కొత్తగా వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ ద్విముఖ ధృవీకరణ పద్ధతి వల్ల సమాచారంలో తప్పులు దొర్లే అవకాశం ఉండదు. స్వీయ గణన ద్వారా పారదర్శకతను పెంచుతూ, సాంకేతికతను జోడిస్తూ నిర్వహిస్తున్న ఈ మహా క్రతువు, భారత పరిపాలనా వ్యవస్థలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తుంది. సమాజంలోని ప్రతి వర్గం ఈ ప్రక్రియలో భాగస్వాములై, సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027 జనగణన కేవలం సంఖ్యల గణన కాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒక శాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలుగనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రక్రియ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరుడిని నేరుగా భాగస్వామిని చేయడం ఒక గొప్ప ప్రజాస్వామ్య విజయం. ఈ చారిత్రాత్మక మార్పుకు సాక్ష్యంగా నిలవడమే కాకుండా, సకల సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో పయనించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# శాపం కాదు.. శాస్త్రం చెబుతున్న నిజం!

**ప్రకృతి సృష్టిలో మనిషి జననం ఒక అద్భుతమైన ప్రక్రియ. అయితే ఈ ప్రక్రియలో గర్భస్థ దశలో జరిగే కొన్ని సహజ మార్పులు సమాజంలో లింగ వైవిధ్యంగా కనిపించే పరిస్థితులకు దారితీస్తాయి. ఒక శిశువు పురుషుడా లేదా స్త్రీనా అనే విషయాన్ని ప్రధానంగా వారసత్వ లక్షణాలు నిర్ణయిస్తాయి.**



గర్భధారణ ప్రారంభ దశలో జరిగే జీవక్రియలు శారీరక నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రక్రియలో ఏవైనా సహజ భేదాలు చోటుచేసుకుంటే, శారీరక లక్షణాలు ఒకలా ఉండి అంతర్గత లేదా హార్మోన్ లక్షణాలు మరోలా ఉండే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఇది ఎవరూ కావాలని ఎంచుకునేది కాదు, ప్రకృతిలో జరిగే వైవిధ్యమే. శారీరక నిర్మాణంతో పాటు, ఒక వ్యక్తి తనను తాను ఎలా గుర్తించుకుంటాడన్నది ముఖ్యమైన అంశం. గర్భధారణ సమయంలో మెదడు అభివృద్ధి చెందే దశల్లో జరిగే సహజ మార్పులు, వ్యక్తి భావోద్వేగాలు లింగ గుర్తింపుపై ప్రభావం చూపుతాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో శరీరం ఒక లింగానికి అనుగుణంగా కనిపించినప్పటికీ, వ్యక్తి తనను తాను మరో లింగంగా భావించే పరిస్థితి ఉంటుంది. ఇది ఒక మానసిక అసమతుల్యం కాదని, సహజమైన వ్యక్తిగత అనుభూతి అని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. అయితే ప్రతి వ్యక్తి పరిస్థితి వేరు వేరుగా ఉండొచ్చు కాబట్టి, దీనిని ఒకే విధంగా అర్థం చేసుకోవడం సరైన విధానం కాదు.

జన్యు లక్షణాలతో పాటు, గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యం, ఆహారం, జీవన శైలి, పరిసర పరిస్థితులు కూడా శిశువు అభివృద్ధిపై కొంతవరకు ప్రభావం చూపవచ్చు. కొన్ని కృత్రిమ రసాయనాలు శరీరంలోని సహజ సమతౌల్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని వైద్య రంగం సూచిస్తోంది. అయితే ఈ అంశాల ప్రభావంపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. అందువల్ల ఇవి ప్రధాన కారణాలుగా కాకుండా, సహాయక ప్రభావాలుగా మాత్రమే పరిగణించాలి. సరైన అవగాహనతో జీవనశైలిని మెరుగుపరచడం సమాజ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు లింగ వైవిధ్యాన్ని ఒక సహజ మానవ లక్షణంగా చూస్తున్నారు. ఇది వ్యాధి కాదని, తప్పు కాదని స్పష్టంగా చెబుతున్నారు. అదే సమయంలో, సమాజంలో ఉన్న వివిధ అభిప్రాయాలను గౌరవిస్తూ, ఈ అంశాన్ని సంయమనంతో, సమతుల్యంగా చర్చించాల్సిన అవసరం ఉంది. సమాజంలో అవగాహన పెరగడం వల్ల అపోహలు తగ్గుతాయి. శాస్త్రం చెప్పే విషయాలను అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో, సామాజిక సున్నితత్వాన్ని కాపాడుకోవడం కూడా అంతే అవసరం.

ప్రతి మనిషి గౌరవంతో జీవించేందుకు హక్కు కలిగినవాడే. లింగ వైవిధ్యం ఉన్న వ్యక్తులను తక్కువగా చూడటం, కించపరిచే పదజాలంతో మాట్లాడటం సమాజానికి మేలు చేయదు. అదే సమయంలో, పరస్పర గౌరవం, అర్థం చేసుకునే దృక్కోణం అవసరం. చట్టపరంగా ఈ వర్గానికి గుర్తింపు లభించడం, సమాన హక్కుల దిశగా ఒక ముందడుగు. అయితే నిజమైన మార్పు సమాజ దృక్కోణంలో మార్పు వచ్చినప్పుడే సాధ్యమవుతుంది. ప్రకృతిలో వైవిధ్యం సహజం. ఆ వైవిధ్యాన్ని గౌరవించడం మన బాధ్యత. విజ్ఞానం మనకు దారి చూపాలి. మానవత్వం మనల్ని కలిపి ఉంచాలి.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170)**



# లొంగిపోయిన మావోలకు పునరావాసం

### పర్యాటక శాఖలో గిరిదర్శక్ గైడ్లుగా శిక్షణ

హైదరాబాద్ : రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా కర్రెగుట్టలు, భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎసఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివ□ద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించాయి. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎదుట భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం.. వారిని గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.



# ఓటమితో ఆగిపోవద్దు... అదే విజయానికి నాంది



### చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించ్ఛాలి

ప్రస్తుతం ఫలితాలు తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రెస్టీజ్ గా తీసుకొని మానసిక ఆందోళనలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులూ ఆలోచించండీ......

తమ పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని ఆశించేది తల్లిదండ్రులే..! బుడిబుడి అడుగుల నుంచి కంటికి రెప్పలా చూసుకుంటూ పిల్లవాడి బంగారు భవిష్యత్తుకు బాటలు సుగమం చేసేది తల్లిదండ్రులే..! పిల్లలకు చిన్న దెబ్బ తగిలినా తమకే తగిలినట్టు విలవిల్లాడేది తల్లిదండ్రులే..! మరి పిల్లలు చేస్తున్నది ఏంటి? ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే కన్నవారికి ధైర్యంగా ఉండాల్సిన తరుణంలో తల్లిదండ్రులకు మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారిపై మార్కుల ఒత్తిళ్లు తేవడం సమంజసమేనా? కొద్దిగా ఆలోచించండి.........

### ఇతరులతో పోల్చడం పిల్లల మనసును గాయపరుస్తుంది

ప్రతి విద్యార్థి ప్రత్యేకమే. విద్యార్థి దశలో పరీక్షలు సాధారణమే అయినప్పటికీ జీవన ప్రయాణంలో విద్యార్థి ఒక గమ్యాన్ని ఎంచుకోవడంలో ఈ ఫలితాలు కొంత మేర దోహదం చేస్తాయని గుర్తించాలి, పరీక్ష ఫలితాల ఆధారంగా లక్ష్య నిర్ధారణ చేసుకోవాలి. ప్రతి విద్యార్థి ప్రత్యేకం తనలో ఉన్న నైపుణ్యాలు తన తోటి విద్యార్థులలో ఉండొచ్చు, ఉండక పోవచ్చు. ఎట్టి పరిస్తితులలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదు. పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయనో, అనుత్తీర్ణులయ్యామనో బాధ పడొద్దు. మార్కులు ర్యాంకులే ప్రధానం కాదు. ప్రపంచంలో లక్ష్యాలేన్నో ఉన్నాయి అందులో మనమూ ఒకటి సాధిద్దాం. ఒక సమిధలా వెలుగుదాం. ప్రపంచానికి ఒక వెలుగును ప్రసాదిద్దాం. గెలుపునకు తుదిమెట్టు అంటూ ఏది ఉండదు, ఓటమి అన్నది ఎప్పుడు అపాయకారి కాదు. మనకు ఈ రెంటిని సాధించాల్సిన దానికి కావాల్సింది మనో ధైర్యం, ఆత్మ విశ్వాసం, పట్టుదల.

### ఫలితాలు కాదు... భవిష్యత్తే ముఖ్యం

విద్యార్థుల ప్రతిభకు మార్కులు కొలమానం కానే కాదు. మార్కుల ఆధారంగా వారి తెలివితేటలను కొలవకూడదు. ప్రపంచంలోని మేధావులంతా మార్కులేమీ సాధించిన వారుకాదు. పిల్లల చదువులను, మార్కులను తల్లిదండ్రులు వంశ ప్రతిష్టగా భావిస్తుంటారు. ఇది తప్పు. విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెట్టకూడదు.

### పిల్లలకు ధైర్యం చెప్పాల్సిన సమయం ఇది

ఫలితాల ప్రకటన తో వచ్చిన మార్కులతో ఎవరు అధైర్యపడకూడదని, నిరుత్సాహానికి గురికావద్దని, తాము అండగా ఉన్నామని తల్లిదండ్రులు పిల్లలకు, ఉపాధ్యాయులు విద్యార్థులకు భరోసా ఇవ్వాలి. తల్లిదండ్రులు తమ పిల్లల గురించి అత్యధిక అంచనాలను కలిగి ఉండకూడదని, పిల్లల వాస్తవిక స్థాయిని గుర్తించి తల్లిదండ్రులు పిల్లలకు భరోసా ఇవ్వాలి.

### చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించ్ఛాలి

ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయినప్పటికీ విద్యార్థులకు మరో అవకాశం ఉంటుంది. సప్లిమెంటరీలు రాసి మళ్లీ పాస్ కావచ్చు. గత పరీక్షల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించవచ్చు. కానీ ఇదేమీ ఆలోచించకుండా క్షణికావేశంలో విద్యార్థులు మనోవేదనకు లోనవుతున్నారు. పరీక్ష తప్పానని, ర్యాంకులు రాలేదని, ఎక్కువ మార్కులు తెచ్చుకోలేదని, విద్యాపరమైన ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని అనేది అక్షర సత్యం,

### ఓటమి తాత్కాలికం... జీవితం అమూల్యం

తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల స్నేహ భావంతో ఉండాలి. పరుష పదజాలంతో దూషించకూడదు. పిల్లల స్నేహాలు, విద్యాలయాలలో వారి ప్రవర్తన, చదువు తీరునూ పరిశీలిస్తుండాలి. చదువు తమ వంశ ప్రతిష్ట అంటూ గర్వాలకు పోకుండా పిల్లల పట్ల సానుకూలంగా ఉండాలి. మార్కులే ధ్యేయంగా పెంచకూడదు. 90% మార్కులు వచ్చిన వారు ఎంత ప్రతిభావంతులో 40% మార్కులు వచ్చిన వారు కూడా అంతే ప్రతిభావంతులనే చిన్న విషయాన్ని పిల్లలకు అర్థం చేయించాలి. ఒకసారి పరీక్షలో తప్పితేనే జీవితం నష్టం పోదనే భరోసా ఇవ్వాలి. మళ్లీ చదివి పాస్ కావచ్చనే ధైర్యం ఇవ్వాలి. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులను తిట్టకుండా, వేధించకుండా సముదాయించాలీ, తిరిగి పాసయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు ప్రతి విషయానికి క్షణికావేశానికి లోనుకాకూడదు.మీ సమస్యను స్నేహితులు, తల్లిదండ్రులు, సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులతో చర్చించాలి. ఏ విషయమైనా తల్లిదండ్రులతో చర్చించాలి.మన ఉజ్వల భవిశ్యత్తును కోరుకునేది తల్లిదండ్రులే.

### మార్కులు కాదు.. విజ్ఞానం ముఖ్యం

విద్యార్థులకు మార్కులు కాదు.. విజ్ఞానం ముఖ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచకూడదు. పిల్లలపై ఫలితాలు వచ్చే సమయంలో ఓ కన్నేసి ఉంచాలి. అధ్యాపకులు కూడా మార్కులు తక్కువగా వచ్చే విద్యార్థులను చిన్నచూపు చూడకూడదు. మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయినా విద్యార్థులు డిప్రెషన్‌కు గురి కాకూడదు.

### ప్రపంచంలోని మేధావులంతా మార్కులేమీ సాధించిన వారుకాదు

విద్యార్థుల ప్రతిభకు మా ర్కులు కొలమా నం కానే కాదు. మార్కుల ఆధారంగా వారి తెలివితేటలను కొలవకూడదు. ప్రపంచంలోని మేధావులంతా మార్కులేమీ సాధించిన వారుకాదు. పిల్లల చదువులను, మార్కులను తల్లిదండ్రులు వంశ ప్రతిష్టగా భావిస్తుంటారు. ఇది తప్పు. విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెట్టకూడదు.

### విజయానికి అసలు బలం ఆత్మ విశ్వాసం, పట్టుదల

విద్యార్థులు అధైర్య పడకూడదు. విద్యార్థులు అధైర్య పడితే తల్లిదండ్రులకు బాధ కలిగించిన వాళ్లవుతారు. మార్కులే జీవితానికి ప్రాతిపదకన కాదు. జీవితాన్ని నడిపించేది సాధించాలనే కసి. పట్టుదల ఆత్మవిశ్వాసం. ఇవీ కలిగిన వ్యక్తులే ముందుకు వెళ్తారు. ఏదైనా సాధిస్తారు. ప్రపంచ విజేతలుగా నిలుస్తారు.

**డా అట్ల శ్రీనివాస్ రెడ్డి రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్ ఫ్యామిలీ కౌన్సెలర్, ARPP - INDIA (అసోసియేషన్ ఆఫ్ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్స్ అండ్ ప్రొఫెషనల్స్ - ఇండియా) జాతీయ అధ్యక్షుడు 9703935321**





వేసవిలో శరీరానికి చల్లదనాన్ని అందించే

# ప్రొటీన్ ఫుడ్

**వేసవి కాలంలో శరీరానికి తేలికగా, చల్లదనాన్ని అందించేలా ఉండే ప్రొటీన్ ఆహారాలను ఎంపిక చేయడం చాలా ముఖ్యం. అధిక ఉష్ణోగ్రతల సమయంలో శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించడానికి ఎక్కువ శ్రమ పడుతుంది. అందుకే ఈ సమయంలో తీసుకునే ఆహారం తేలికగా జీర్ణమయ్యేలా, శరీరానికి శక్తినిచ్చేలా ఉండాలి. కనుక ఇటువంటి సమయంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.**

ప్రొటీన్ సాధారణంగా బరువు తగ్గడానికే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ వాస్తవానికి ఇది శరీర నిర్మాణానికి ప్రధాన మూలం. కండరాల పునరుద్ధరణ, రోగ నిరోధక శక్తి పెంపు, అలాగే ఎక్కువసేపు తృప్తిగా ఉండటానికి ఇది కీలకం. ముఖ్యంగా శరీరం ప్రొటీన్‌ను నిల్వ చేసుకోలేకపోవడం వల్ల ప్రతిరోజూ ఆహారంలో చేర్చడం అవసరం. వేసవిలో ప్రొటీన్ ఆహారాలను ఎంచుకునే సమయంలో అవి తేలికగా, హైడ్రేటెడ్‌గా, జీర్ణానికి సులభంగా ఉండేలా చూసుకోవాలి. దీంతో శరీరంలో అధిక వేడి పెరగకుండా, శక్తి స్థాయిలు సంతుల్యంగా ఉంటాయి. వేసవి కాలంలో తీసుకోవాల్సిన ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

**చికెన్ బ్రెస్ట్, చేపలు, పనీర్..**

లీన్ మీట్స్‌గా చెప్పబడే చికెన్ బ్రెస్ట్, చేపలు వేసవిలో మంచి ఎంపిక. ఇవి ప్రొటీన్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉండటం వల్ల శరీరానికి తేలికగా అనిపిస్తాయి. పప్పులు, శనగలు, పెసర్లు వంటి లెగ్యూమ్స్ కూడా ప్రొటీన్‌కు మంచి వనరులు. వీటిని సలాడ్స్‌లో, చల్లని వంటల్లో లేదా హమ్మస్‌లాంటి వంటకాల రూపంలో తీసుకోవచ్చు. శాకాహారులకు ఇవి ఉత్తమ ఎంపిక అని చెప్పవచ్చు. అలాగే గ్రీక్ యోగర్ట్ వేసవిలో చల్లగా తినడానికి అనువైన ప్రొటీన్ ఆహారం. దీన్ని పండ్లతో కలిపి లేదా స్మూతీగా తీసుకుంటే శరీరానికి తేలికగా ఉంటుంది. అలాగే ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియకు సహాయపడతాయి. అదే విధంగా కాటేజ్ చీజ్ (పనీర్) కూడా ప్రొటీన్‌ను సమృద్ధిగా కలిగి ఉంటుంది. దీన్ని కర్రీల్లో, పరాటాల్లో లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. బాదం, ఆక్రోట్, చియా గింజలు, ఫ్లాక్స్ సీడ్స్ వంటి నట్లు, గింజలు ప్రొటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. ఇవి మధ్యాహ్నం ఆకలి వేయకుండా నిరోధిస్తాయి.

**మజ్జిగ, సత్తు పిండి..**

మజ్జిగ (చాస్) వేసవిలో అత్యుత్తమ శీతల పానీయం. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంతో పాటు పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాలను అందిస్తుంది. అలాగే గట్ హెల్త్‌కి కూడా ఉపయోగపడుతుంది. సత్తు (వేయించిన శనగ పిండి) వేసవిలో చాలా ప్రాచుర్యం పొందిన ఆహారం. ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా ఫైబర్‌ను సమృద్ధిగా అందిస్తుంది. కినోవా పూర్తిస్థాయి ప్రొటీన్ వనరు. దీనిలో అన్ని అవసరమైన అమినో ఆమ్లాలు ఉంటాయి. దీనిని సలాడ్స్‌లో లేదా చల్లని బౌల్స్‌గా తీసుకోవచ్చు. టోఫు, టెంపె వంటి ప్లాంట్-బేస్డ్ ప్రొటీన్ ఆహారాలు కూడా వేసవిలో అనువైనవి. వీటిని గ్రిల్ చేసి లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. వేసవి కాలంలో తేలికగా, శరీరాన్ని చల్లగా ఉంచే ప్రొటీన్ ఆహారాలను తీసుకోవడం ద్వారా శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు వేసవి ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

# ఆత్మవిశ్వాసం ఆవిరైందా?

## అధికార పీఠంపై రేవంత్ రెడ్డికి పట్టు సడలుతోందా?

**తెలంగాణ రాజకీయ యవనికపై అనూహ్య పరిణామాల మధ్య ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన రేవంత్ రెడ్డి, తన పదవీ కాలంపై స్వయంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీశాయి. ఒకవైపు 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని బహిరంగ సభల్లో ధీమా వ్యక్తం చేస్తున్న రేవంత్, మరోవైపు ప్రైవేట్ వేదికలపై అందుకు భిన్నంగా మాట్లాడుతుండటం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.**



ఇటీవల ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, "నేను 2028 డిసెంబర్ వరకు మొదటి విడత ముఖ్యమంత్రిగా ఉంటాను.. ఈ లోపే మీరు మరిన్ని ఆసుపత్రులు నిర్మించి నన్ను పిలవాలి" అని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. బహిరంగంగా పదేళ్ల పాలన గురించి మాట్లాడే రేవంత్, ఇలా 'మొదటి విడత' అంటూ గడువు విధించుకోవడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటనే ప్రశ్న ఉదయిస్తోంది. ఇది కేవలం మాట వరుసకు అన్నదా లేక తన రాజకీయ భవిష్యత్తుపై ఆయనకు కలిగిన ముందస్తు అవగాహనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తన పదవీ కాలంపై ఇటువంటి పరిమిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**మరుతున్న ప్రజా నాడి**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందనే వాదనలు గత కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 2026 నాటి నివేదికల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం, విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వంటి అంశాలు సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాఠశాల స్థాయి ఎన్నికల్లో కూడా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఉదహరిస్తూ విద్యార్థులు మాట్లాడుకుంటున్నారంటే, ప్రభుత్వ విశ్వసనీయత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ, ప్రస్తుత పాలనలో ప్రజల అసహనం మరింత పదునెక్కిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే ఇన్ని విమర్శలు మూటగట్టుకోవడం రేవంత్ రెడ్డికి ఆందోళన కలిగించే విషయమే. బహుశా ఈ ప్రతికూల పవనాల వల్లే, మళ్ళీ అధికారంలోకి రావడం కష్టమనే సంకేతాలను ఆయన తన మాటల ద్వారా పరోక్షంగా ఇస్తున్నారా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

**పేదల ఆరోగ్యానికి శాపమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కంటే ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీ, నిమ్స్ లేదా జిల్లాల్లోని ప్రభుత్వ వైద్యాలయాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సింది పోయి, బడా కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడం గమనార్హం. ఒక ముఖ్యమంత్రిగా ప్రైవేట్ ఆసుపత్రులలో పేదలకు కనీసం కొంత శాతమైనా రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేయాల్సింది పోయి, వారు వందలాది శాఖలు విస్తరించాలని కోరుకోవడం బాధ్యతారాహిత్యమని కొందరు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగా మారుతున్న తరుణంలో, ప్రభుత్వ పెద్దలు ప్రైవేట్ శక్తులకు మద్దతుగా నిలవడం నైతికంగా ఏమాత్రం సమర్థనీయం కాదు. ఈ కార్పొరేట్ అనుకూల విధానం వల్ల భవిష్యత్తులో సామాన్య ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి క్రమంగా దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రజల రక్తం పిండే సంస్థల కంటే ప్రజల పక్షాన నిలిచే ప్రభుత్వ యంత్రాంగంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**రాజకీయ అనిశ్చితి.. ప్రజా తీర్పు**

మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆయనలో ఉన్న నైతిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంలో సఫలమైనప్పటికీ, స్థానికంగా ప్రజల నమ్మకాన్ని గెలవడంలో ఆయన వెనుకబడ్డారని విశ్లేషణలు చెప్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే మీడియా కథనాలను లేదా ప్రజా ఉద్యమాలను బేఖాతరు చేయమని తన అనుచరులకు సూచించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య. అధికారం అనేది శాశ్వతం కాదని, అది కేవలం ప్రజలు ఇచ్చిన ఒక గొప్ప అవకాశమని గుర్తించకపోతే రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. కేవలం ప్రైవేట్ సంస్థల ప్రయోజనాల కోసం పనిచేస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే.. 2028లో ప్రజలు ఇచ్చే తీర్పు రేవంత్ రెడ్డి ఊహించిన దానికంటే అత్యంత పదునుగా ఉండవచ్చు.

**ఉక్కల్ కర్
రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170**



# పరిమిత మోతాదులో సేవిస్తే కాఫీతో లాభాలు..



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాల్లో కాఫీ ఒకటి. సాధారణంగా కాఫీని నిద్రలేమి, ఆందోళన, గుండె వేగం పెరగడం, జీర్ణ సమస్యలు వంటి ప్రతికూల ప్రభావాలతో అనుసంధానిస్తారు. అయితే కాఫీ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల కాఫీని రెండు వారాల పాటు నియమితంగా తీసుకుంటే శరీరంపై పలు సానుకూల ప్రభావాలు కనిపిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**లివర్ ఆరోగ్యానికి..**

కాఫీ కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నియమితంగా కాఫీ తాగడం వల్ల ఫ్యాటీ లివర్, ఫైబ్రోసిస్, సిరోసిస్ వంటి సమస్యల ప్రమాదం తగ్గుతుంది. దీని వల్ల లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అలాగే కాఫీ మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి శరీరంలోని మెటబాలిక్ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడంలో సహాయపడతాయి. మెదడు పనితీరును ఉత్తేజపరుస్తుంది. కాఫీలోని కెఫీన్ అలర్ట్‌నెస్, దృష్టి, మానసిక పనితీరును పెంచి మెదడు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కాఫీ సహాయపడుతుంది. ఇది పెద్దపేగును ఉత్తేజపరచి గట్ మోటిలిటీని పెంచడం ద్వారా జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది.

**వీరు మితంగా తీసుకోవాలి..**

అయితే కాఫీ వినియోగంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. IBS లాంటి సమస్యలు ఉన్నవారు కాఫీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధారణంగా పెద్దలకు రోజుకు ఒకటి నుంచి రెండు కప్పుల బ్లాక్ కాఫీ సరిపోతుంది. కానీ గుండె దడ, ఆందోళన, ఆమ్లత్వం లేదా నిద్ర సమస్యలు ఉంటే కాఫీని తగ్గించడం లేదా మానేయడం మంచిది. కాఫీలో అధికంగా చక్కెర లేదా ప్రాసెస్ చేసిన క్రీమ్‌లను కలపడం ఆరోగ్యానికి హానికరం. వీటిని తగ్గించడం అవసరం. కాఫీ తాగేటప్పుడు కొంత చల్లారిన తర్వాత తేనె కలపడం లేదా స్టీవియా, మాంక్ ఫ్రూట్ వంటి సహజ తీపి పదార్థాలను ఉపయోగించడం మంచిది. సరైన పరిమాణంలో, సరైన విధంగా తీసుకుంటే కాఫీ శరీరానికి పలు ప్రయోజనాలు అందించే పానీయంగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.




## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. చమురు భగభగలు, అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 400 పాయింట్ల మేర నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 77,094 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,493 పాయింట్ల గరిష్ఠానికి.. 76,741 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 416 పాయింట్ల నష్టంతో 76,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు కోల్పోయి, 23,995 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 41 పైసలు కోల్పోయి, చివరకు 94.56కు చేరింది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస, కోల్ ఇండియా, రిలయన్స్, నెస్లే షేర్లు రాణించగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మారుతీ సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టపోయాయి.




**కారణాలివీ..**

వరుసగా 3 రోజుల నష్టాల తర్వాత, సోమవారం దేశీయ సూచీలు లాభాల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. దాంతో నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. బ్యాంకింగ్, ఐటీ, రియాల్టీ షేర్లు నష్టపోయాయి. మరోపక్క చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 110 డాలర్లు దాటింది. విదేశీ సంస్థాగత మదుపర్లు తమ వాటాలను విక్రయించడమూ, మంగళవారమే డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు కావడమూనష్టాలకు కారణాలని తెలుస్తోంది.

# భారత్-న్యూజిలాండ్ మధ్య ఎఫ్‌టీఏ ఒప్పందం ఖరారు

## భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టడానికి న్యూజిలాండ్‌కు అవకాశం

భారత్, న్యూజిలాండ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్యం సహా పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇరుదేశాలు ఈ డీల్ చేసుకున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయెల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే ఈ ఎఫ్‌టీఏ డీల్‌పై సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టీఏ వల్ల భారత్‌కు ఎంతో మేలు చేకూరనుంది. ముఖ్యంగా భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే అన్ని ఉత్పత్తి కేటగిరీలకు, అన్ని టారిఫ్ లైన్లకు ప్రవేశ పన్నుల నుంచి మినహాయింపు దొరుకుతుంది. దీనివల్ల వస్త్రాలు (టెక్స్‌టైల్స్), దుస్తులు (అపెరల్స్), (తోలు) లెదర్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్స్ లాంటి రంగాల్లో పోటీతత్వం పెరుగుతుంది. తద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, ఉపాధి కల్పనకు మంచి ఊతం లభిస్తుంది. ఇంతకు ముందు, సెరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలతో సహా కీలకమైన భారతీయ ఎగుమతులపై న్యూజిలాండ్ గరిష్ఠంగా 10 శాతం వరకు సుంకాలు విధించేది. కానీ తాజాగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో, న్యూజిలాండ్‌లోకి భారతీయ ఉత్పత్తులు ఎలాంటి సుంకం లేకుండా ప్రవేశించగలుగుతాయి. అందువల్ల ఇతర దేశాల ఉత్పత్తులతో భారతీయ వస్తువులు పోటీపడగలుగుతాయి. అంతేకాదు ఈ డీల్ వల్ల, తయారీ రంగానికి అవసరమైన చెక్క దుంగలు (వుడెన్ లాగ్స్), కోకింగ్ కోల్, లోహాల వ్యర్థాలు (స్క్రాప్) వంటి పదార్థాలను సుంకం లేకుండానే దిగుమతి చేసుకునే వెసులుబాటును భారత్ పొందింది. ఇది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, భారత పరిశ్రమలు ప్రపంచ మార్కెట్లతో మరింతగా పోటీపడడానికి వీలు కల్పిస్తుంది.



**సుంకాల సరళీకరణ**

మరోవైపు భారత్ తన 70.03 శాతం టారిఫ్ లైన్లపై సుంకాలను సరళీకరించింది. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువలో 95 శాతం ఉండడం గమనార్హం. అయితే భారతదేశంలోని సున్నితమైన రంగాలను రక్షించడానికి 29.97 శాతం టారిఫ్ లైన్లను మాత్రం మినహాయింపుల జాబితాలో ఉంచింది.

**వీటికి మినహాయింపు**

ఈ మినహాయింపు జాబితాలో ప్రధానంగా ఉన్నవి ఏమిటంటే, పాల ఉత్పత్తులు (పాలు, క్రీమ్, పెరుగు, చీజ్ మొదలైనవి), జంతు ఉత్పత్తులు (గొర్రె మాంసం మినహా), వ్యవసాయ ఉత్పత్తులు (ఉల్లిపాయలు, శనగలు, బఠానీలు, మొక్కజొన్న, బాదం), చక్కెర, కృత్రిమ తేనె, జంతు/వృక్ష సంబంధిత కొవ్వులు, నూనెలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, రాగి– దాని అనుబంధ వస్తువులు (కాథోడ్, కార్ట్రిడ్జ్‌లు, రాడ్‌లు, బార్‌లు, కాయిల్స్), అల్యూమినియం– దాని అనుబంధ వస్తువులు (ఇంగాట్స్, బిల్లెట్లు, వైర్ బార్‌లు) మొదలైనవి.

**న్యూజిలాండ్‌కు కలిగే లాభాలు ఇవే!**

మరోవైపు ఈ డీల్ ద్వారా న్యూజిలాండ్‌కు చెందిన 30 శాతం టారిఫ్ లైన్లపై భారత్ సుంకాలను రద్దు చేసింది. ఇందనులో కలప, ఉన్ని, గొర్రె మాంసం, లెదర్–రా హైడ్స్ లాంటి వస్తువులున్నాయి. అదే విధంగా 35.60 శాతం టారిఫ్ లైన్స్‌పై 3, 5, 7, 10 సంవత్సరాల కాల పరిమితిలో దశలవారీగా సుంకాలు తొలగించనున్నారు. వీటిలో పెట్రోలియం ఆయిల్, మాల్ట్ ఎక్స్‌ట్రాక్ట్, వెజిటబుల్ ఆయిల్స్ సహా, కొన్ని ఎంపిక చేసిన ఎలక్ట్రిక్, మెకానికల్ యంత్రాలు, పెప్టోన్‌లు కూడా ఉన్నాయి. ఇక టారిఫ్ తగ్గింపుల వల్ల ప్రయోజనం పొందే న్యూజిలాండ్ ఉత్పత్తుల్లో వైన్, ఫార్మాస్యూటికల్ డ్రగ్స్, పాలిమర్‌లు, అల్యూమినియం, ఇనుము, ఉక్కు వస్తువులు ఉన్నాయి. మనుకా తేనె, యాపిల్స్, కివీ పళ్లు, మిల్క్ అల్బుమిన్‌తో కూడిన అల్బుమిన్‌లు వంటి కేవలం 0.06 శాతం వస్తువులు మాత్రమే టారిఫ్ రేట్ కోటాల కిందకు వస్తాయి.

**20 బిలియన్ డాలర్ల పెట్టుబడి**

అన్నికంటే ముఖ్యంగా ఈ ఎఫ్‌టీఏ ద్వారా భారత దేశంలో న్యూజిలాండ్ 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించారు. దీని ద్వారా వచ్చే 15 ఏళ్లలో న్యూజిలాండ్ భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఏర్పడింది. అంతేకాదు పెట్టుబడుల డెలివరీలో ఏమైనా లోపాలు ఉంటే, వాటిని పరిష్కరించేందుకు, పటిష్టమైన ఆర్థిక ఫలితాలను పొందేందుకు వీలుగా ఒప్పందంలో ఒక 'రీబ్యాలెన్సింగ్ క్లాజ్'ను కూడా చేర్చారు. వాస్తవానికి ఇటీవలి కాలంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వస్తు వాణిజ్యం హెచ్చుతగ్గులకు గురైంది. కానీ సేవల వాణిజ్యం మాత్రం ఊపందుకుంది. 2024లో న్యూజిలాండ్‌కు భారత సేవల ఎగుమతులు సుమారు 13 శాతం మేర పెరిగి 634 మిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు సుమారు 7 శాతం పెరిగి 611 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# క్రెడిట్ కార్డు మినిమమ్ బిల్లు చెల్లిస్తున్నారా?

## బిల్లు చెల్లింపులో జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు!

**ప్రస్తుత రోజుల్లో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఈ కార్డులు వచ్చాక కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయడం ఈజీ అయిపోయింది. చేతిలో చిల్లగవ్వ లేకపోయినా క్రెడిట్ కార్డు ఉంటే చాలు.. కావాల్సినంత షాపింగ్ చేసేయొచ్చు. ఇదే క్రమంలో కొన్నిసార్లు చెల్లించాల్సిన బిల్లు పెద్ద మొత్తంలో ఉంటుంది. అలాంటి టైమ్‌లో చాలా మంది మినిమమ్ బిల్లు కట్టేస్తుంటారు. క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్‌కు సరిపడా డబ్బులు లేనప్పుడు ఇదే పద్ధతి ఫాలో అవుతుంటారు ఎక్కువ మంది.**

మీరూ క్రెడిట్ కార్డు బిల్లును ఇలానే పే చేస్తున్నారా? అయితే, వెంటనే అలా కట్టడం మానుకోవడం మంచిదని సూచిస్తున్నారు ఆర్థిక నిపుణులు. ఎందుకంటే "క్రెడిట్ కార్డు మినిమమ్ బిల్లు పే" చేయడం వల్ల కొన్ని లాభనష్టాలు ఉంటాయంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

సాధారణంగా క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్‌లో మూడు రకాల ఆప్షన్లు ఉంటాయి. అవేంటంటే, ఫుల్ అమౌంట్(పూర్తి మొత్తం), మినిమమ్ డ్యూ, అదర్ అమౌంట్. ఇందులో ఏ నెల కానెల మొత్తం బిల్లు కట్టేస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. అలాకాకుండా ఆ నెల బిల్లులో మొత్తం కట్టకుండా కొంతమొత్తం మాత్రమే చెల్లించడాన్ని 'మినిమమ్ డ్యూ లేదా మినిమమ్ అమౌంట్ పేమెంట్' అంటారు. చాలా వరకు క్రెడిట్ కార్డు సంస్థలు మొత్తం బిల్లులో ఐదు శాతం అమౌంట్‌ను మినిమమ్ డ్యూగా చూపిస్తాయి. సంస్థ లేదా బ్యాంకును బట్టి ఈ మొత్తంలో స్వల్ప మార్పులుండొచ్చు.




క్రెడిట్ కార్డులు వాడే వారిలో చాలా మంది మినిమన్ డ్యూ చెల్లిస్తే ఎలాంటి వడ్డీ పడదని అనుకుంటారు. కానీ, అది వాస్తవం కాదంటున్నారు నిపుణులు. మినిమమ్ డ్యూ చెల్లిస్తే పెనాల్టీలు, లేటు ఫీజుల నుంచి మాత్రమే మీకు ఊరట దక్కుతుందని చెబుతున్నారు. మీరు చెల్లించాల్సిన మొత్తం బిల్లుపై మాత్రం ఆయా క్రెడిట్ కార్డు సంస్థలు భారీగా వడ్డీని వసూలు చేస్తాయని సూచిస్తున్నారు. అలాగే, ఈ వడ్డీ 48 శాతం వరకు ఉంటుందంటున్నారు.

ఉదాహరణకు ఒక వ్యక్తి ఫిబ్రవరిలో క్రెడిట్ కార్డుతో రూ.20 వేల వరకు ఖర్చు చేశాడనుకుందాం. మార్చిలో మొత్తం బిల్లు కట్టాల్సి ఉంటుంది. అయితే, ఆ నెల అతను డబ్బులు లేకపోవడం వల్ల మినిమమ్ బిల్లుగా రూ.1000 కట్టాడు. అంటే, వచ్చే నెలలో అతను 19 వేలు రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని అనుకుంటాడు. కానీ, అది నిజం కాదు. తర్వాత నెలలో అతను ఆ 19 వేల రూపాయలతో పాటు వడ్డీని కూడా చెల్లించాలి. ఈ వడ్డీ అత్యధికంగా 36 నుంచి 48 శాతం వరకు ఉంటుంది. ఒకవేళ ఆ నెల కూడా కొంత మొత్తం షాపింగ్ చేస్తే అది కూడా తర్వాతి నెల బిల్లింగ్‌లో పే చేయాల్సి ఉంటుంది.

# ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ (ఐజీఎక్స్)లో 1 శాతం వాటా విక్రయం!

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం.. ఎన్ఎస్ఈ తాజాగా ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ(ఐజీఎక్స్)లో 1 శాతం వాటా విక్రయించింది. నేచురల్ గ్యాస్ డెలివరీ ఆధారిత ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ఐజీఎక్స్‌లో వాటాను నియంత్రణ సంస్థల నిబంధలనమేరకు అమ్మినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐజీఎక్స్‌లో ఏ ఒక్క సంస్థ 25 శాతానికి మించి వాటాను కలిగి ఉండటాన్ని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ నియంత్రణ సంస్థ(పీఎన్‌జీఆర్‌బీ) మార్గదర్శకాలు అనుమతించవు. నేచురల్ గ్యాస్‌లో స్పాట్, ఫార్వార్డ్, డెలివరీ ఆధారిత కాంట్రాక్టులకు ఐజీఎక్స్ నిర్వహించే ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ వీలు కల్పించే సంగతి తెలిసిందే. కాగా.. తాజా వాటా విక్రయం తదుపరి ఐజీఎక్స్‌లో ఎన్ఎస్ఈ వాటా 25 శాతానికి పరిమితమైంది. 2021 మార్చిలో ఎన్ఎస్ఈ రూ. 19 కోట్లకు ఐజీఎక్స్‌లో 26 శాతం వాటాను సొంతం చేసుకుంది. పీఎన్‌జీఆర్‌బీ నుంచి అనుమతులు పొందడం ద్వారా ఐజీఎక్స్‌కు సహప్రమోటర్‌గా అవతరించింది. దేశీ నేచురల్ గ్యాస్ ధరల ఆధారంగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ డెరివేటివ్స్‌కు తెరతీసేందుకు వీలుగా ఎన్ఎస్ఈ ఈ నెల మొదట్లో ఐజీఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న విషయం విదితమే. వెరసి ఐజీఎక్స్ ప్రామాణిక ధరల ఇండెక్స్ జీక్సీ ఆధారంగా గ్యాస్ ఫ్యూచర్ కాంట్రాక్టులకు శ్రీకారం చుట్టనుంది. ఇక మరోపక్క ఐజీఎక్స్ ఈ జనవరిలో పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు చేపట్టింది. ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఐపీవో చేపట్టాలని భావిస్తోంది. 2026 జూన్‌లోగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే వీలున్నట్లు ఎండీ, సీఈవో రాజేష్ కుమార్ ఎం. పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గ్రామాల అభివృద్ధి, తాగునీటి సమస్యల నివారణపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి, ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు అనంతరం రైతులకు తక్షణమే చెల్లింపులు జరగేలా చూడాలని సూచించారు. ప్రతి దశలో అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని అన్నా రు. ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని మంత్రి పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పైపులైన్ మరమ్మత్తులు, ట్యాంకుల పునరుద్ధరణ వంటి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి, హాజరు శాతం పెంచాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని, రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ బూత్‌స్థాయి బలోపేతంపై సన్నాహక సమావేశం



బీఎల్ఏ నియామకంతో పార్టీ పటిష్టత

ప్రతి ఓటు కీలకమని నాయకుల పిలుపు

రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం):** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సంబంధించి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ అధ్యక్షత వహించగా, చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు హాజరై పార్టీ నిర్మాణం, బూత్ స్థాయి ప్రతినిధుల నియామకం, క్రమశిక్షణపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నేపథ్యంలో ప్రతి ఓటు విలువ పెరిగిందని చెప్పారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటములు ఎదురైన నేపథ్యంలో బూత్ స్థాయిలో జాగ్రత్తలు అవసరమని సూచించారు. కరీంనగర్ నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో బీఎల్ఏ-2 నియామకాన్ని తక్షణమే పూర్తి చేయాలని, స్థానిక నాయకులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఓట్ల పరిరక్షణ అత్యంత ముఖ్యమని, ప్రతి బూత్‌లో బలమైన వ్యవస్థ ఏర్పాటుతో పార్టీ స్థాయిని పెంచవచ్చని ఆయన పేర్కొన్నారు.

# ధర్మపురి క్షేత్రానికి మాస్టర్ ప్లాన్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్





**ధర్మపురి ఎప్రిల్ 28(నినాదం):** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల సందర్భంగా నదీ తీరం వెంబడి ఉన్న ప్రాచీన క్షేత్రాలను సమగ్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంగళవారం ధర్మపురిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కార్మిక ఉగనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. మాస్టర్ ప్లాన్ అమలు దిశగా వేగవంతమైన చర్యలు దర్శనానంతరం మంత్రులు ఆలయ పరిసరాలు, మాడ వీధులు, కోనేరు, యాత్రికుల వసతి ప్రాంతాలు, దేవస్థానం ఆవరణలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం అమలులో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులు, మెరుగుదలలపై అధికారులకు సూచ నలు చేశారు. ఆలయ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావే శంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ వివరాలు పరిశీలించారు. యాత్రి కుల సౌకర్యాల విస్తరణ, రహదారి విస్తరణ, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, శానిటేషన్, నది ఘాట్‌ల అభివృద్ధి, హరిత వాతావరణం కల్ప న, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశా లపై అధికారులకు స్పష్టమైన దిశా నిర్దేశం ఇచ్చారు. గోదావరి పుష్కరాల దృష్ట్యా ప్రత్యేక ప్రణాళికఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాది భక్తులు ధర్మపురికి రానున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముం దస్తు ఏర్పాట్లు చేయాలని ము ఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు వెల్లడించారు. గోదావరి తీరం వెంటఉన్న ఆలయాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పుష్కరాల నాటకి ధర్మపురిలో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా కార్యాచ రణ రూపొందిస్తున్నామని తెలిపారు. టెంపుల్ సిటీగా ధర్మపురి రూపాంతరం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసిం హస్వామి ఆలయాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో సమగ్ర పట్టణాభివృద్ధి, యాత్రికులకు ఆధునిక వసతులు, పర్యాటక ఆకర్షణల పెంపు వంటి అంశాలను అమలు చేస్తామన్నారు.

# నీట్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం):** కరీంనగర్ జిల్లాలో మే 3న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు అధికారులు సమగ్రంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పరీక్షా కేంద్రాల ప్రధాన పర్యవేక్షకులు, విద్య, వైద్య, పోలీసు శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లపై చ ర్చించారు. జిల్లాలో మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, శౌచాలయాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూసి, పరీక్ష ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ వంటి ఒరిజినల్ గుర్తింపు పత్రంతో హాజరు కావాలని, మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ హాజరు విధానం అమలులో ఉంటుందని, నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, ఆలుగునూరులోని కేంద్ర విద్యాలయం, ప్రతిభా పాఠశాల, ఉజ్వల పార్క్ సమీపంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాల, చింతకుంట ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాల, కేబుల్ బ్రిడ్జి సమీపంలోని మైనార్టీ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయ దర్శనం

ప్రత్యేక పూజలు చేసిన మేయర్, డిప్యూటీ మేయర్



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం):** కరీంనగర్ నగరంలోని రాంనగర్‌లో ఉన్న శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని మంగళవారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు, నూతనంగా ఎన్నికైన సహ నియా మక సభ్యులు సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ గాజరమ శివరాం ఆధ్వర్యంలో వారు స్వామివారిని దర్శించుకుని వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా గాజరమ శివరాం మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు సహ నియామక సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బండారి వేణు, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, సహ నియామక సభ్యులు కన్న కృష్ణ, బర్బీర్ సింగ్, నందకుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక సాగుపై దృష్టి సారించాలి

-పంట పొలాలలో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి

-అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్



**జమ్మికుంట, ఏప్రిల్ 28 (నినాదం):** రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కలిగి ఉండి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా జై శంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మడిపల్లి రైతు వేదుకలు శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు యూరియా మరియు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట వైవిధ్దీకరణ పాటించాలన్నారు. మార్కెట్లో అధిక గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలను గడించవచ్చునని సూచించారు. రైతులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిఫార్చేసిన రకాలను సాగు చేయడం వల్ల రైతులకు సకాలంలో రైతు బోనస్ తోపాటు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేవలం ప్రభుత్వం ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ పసుల తిరుమల, అంకుసాపూర్ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ సదానందం, వ్యవసాయ విస్తరణ అధికారి రాంప్రసాద్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక



**జమ్మికుంట, ఏప్రిల్ 28 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ వర్కర్స్ సిఐటియు ఆధ్వ ర్యంలో నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో సమావేశమైన మున్సిపల్ కార్మికులు దొడ్డ సంపత్ ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మోతే రమేష్ లను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాపై నమ్మకంతో మమ్మల్ని ఎన్నుకున్న కార్మికులకు అండగా ఉంటామని సమస్యలను పరిష్కరించ డంలో నిష్పక్షపాతంగా పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మా ఎన్నికల సహకరించిన సహకార కార్మికులకు వారు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు దొడ్డరాజు సారయ్య వడ్లూరి సరోజన సోఐడి పద్మ ఉల్లి సరోజ సంచాల మొగిలి పాల్గొన్నారు.

# మే5న నిరాహార దీక్షకు ఉద్యోగుల ఐక్య పిలుపు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూ జేఏసీ డిమాండ్

జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం ):** తెలంగాణ ఉద్యోగుల సంయుక్త చర్యా సమితి ఆధ్వర్యంలో మే 5న నిర్వహించనున్న ఒక్కరోజు నిరాహార దీక్షను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు భాగస్వామ్య సంఘాలతో జరిగిన అత్యవ సర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యో గుల హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో అమలు చేసే ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డియర్లు, సంవత్సరానికి ఇవ్వాల్సిన వేతన పెరుగుదలలు, ఐదేళ్లకు ఒకసారి అమలు చేయాల్సిన వేతన సవరణలు సమయానికి అమలు కావడం లేదన్నారు. 2023 జూలై నుంచి అమలులోకి రావాల్సిన వేతన సవరణ ఇప్పటికీ అమలు కాలేదని, మ ధ్యంతర ఉపశమనంతోనే సరిపెట్టడం జరుగు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు రావాల్సిన ఐదు డియర్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భవిష్యనిధి డబ్బులు, సెలవుల నగదు బిల్లులు, బీమా బిల్లు లు, వివిధ బకాయిలు నిలిచిపోవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, కొత్త పెన్షన్ విధానం రద్దుపై స్పష్టత లేదని విమర్శించారు. ఆరోగ్య కార్డు పథకం సక్రమంగా అమలు కాకపోవడం, అనుబంధ ఆసుపత్రులు ఖరారు చేయకపోవడం వల్ల వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలలో ఆలస్యంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఒకే స్వరంతో నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించే మే 5 నిరాహార దీక్షలో ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి కటకం రమేష్ పేంద్యాల కేషవ రెడ్డి వివిద ఉపాధ్యాయ సంఘ నాయకులు తిరుపతిరావు జయపాల్ రెడ్డి సుంకిశాల ప్రభాకర్ రావు చింతపల్లి అశోక్ జైపాల్ రెడ్డి కోట రామస్వామి శంకర్ జాలి మహేంద్రరెడ్డి జకోజి వెంకటేశ్వర్లు చంద్రమౌళి వివిధ సంఘాల సంబంధించిన నాయకులు డాక్టర్ అరవింద్ రెడ్డి సర్దార్ హర్మిందర్ సింగ్ శారద సునీత సరిత సబిత సుస్మిత శైలజ రాగి శ్రీనివాస్ రమేష్ గౌడ్ మారుపాక రాజేష్ భరద్వాజ్ పోలు కిషన్ వెలిచాల సుమంతరావు రోహిత్ వెంకట్ రెడ్డి తాళ్ళపెల్లి రాంమోహన్ బోనాల రవి వంశీ రమేష్ లవ కుమార్ కరుణాకర్ జీనస్ ఆనందం తదితరులు పాల్గొన్నారు

## ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోండి



**జమ్మికుంట, ఏప్రిల్ 28 (నినాదం)** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు రైల్వే గేట్ మూసివేయడానికి తీర్మానం సమర్పించగా.. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్(దిలీప్), పాలకవర్గం ఆమోదించారు. మంగళవారం మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ భారతీయ రైల్వే సాధారణ నియమాలను అనుసరించి లెవెల్ క్రాసింగ్ లను తొలగించి రద్దీ నియంత్రణ చేయు లక్ష్యంతో సౌత్ సెంట్రల్ రైల్వే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మడిపల్లి క్రాస్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంను చేయుటకు గేటు మూసివేయడానికి కౌన్సిల్ సభ్యులు ముందు తీర్మాణం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేసిన పిదప మాత్రమే రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును మూసివేయుటకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించిన్నట్లు చైర్మెన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇట్టి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలు సెంట్రల్ రైల్వే జోన్ ఖాజీపేట వారికి డిపీఆర్, ఇతర వివరాలు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ అభివృద్ధి మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వాణీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలి



**జమ్మికుంట, ఏప్రిల్ 28 (నినాదం) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలని నిరసిస్తూ మంగళవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేటర్ భర్త మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పై దాడి చేయడం జరిగిందని నిరసన తెలుపడం జరిగిందన్నారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ఉద్యోగులకు కనీస భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు పలువులు పాల్గొన్నారు.

## చీటింగ్ కేసులో వ్యాపారి రిమాండ్

**జమ్మికుంట, ఏప్రిల్ 28 (నినాదం):** తప్పుడు పత్రాలతో మోసం చేసి భూమిని కాచేయాలని ప్రయత్నం చేసిన పట్టణానికి చెందిన వ్యాపారిపై గతంలో 420 కేసు నమోదు కాగా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి తనకు సంబంధించిన భూమిని ఫోర్జరీ సంతకాలతో దక్కించుకోవాలని ప్రయత్నం చేయడంతో బాధితుడు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయక విచారణ జరిపిన పోలీసులు మంగళవారం ఆ వ్యాపారిని రిమాండ్కు తరలించగా మెజిస్ట్రేట్ జైలుకు పంపించినట్లు సమాచారం.

## అభివృద్ధే అంతిమ లక్ష్యం

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల, ఏప్రిల్ 28 (నినాదం):** అభివృద్ధే అంతిమ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ సమీపంలో రూ. 3.70 లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలు, పట్టణా లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకొని పని చేస్తుందని వెల్లడించారు. పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రభుత్వం అంకితభావంతో ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంతా గంగాధర్ మున్సిపల్ కమిషనర్ రవీందర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, తోట గంగాధర్, తెడ్డు విజయ్, నజ్జు, ఎలిశెట్టి భూశీరెడ్డి, ఎతిరాజం నర్సయ్య, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జెట్టి లింగంపై కాంగ్రెస్ నేతల విమర్శలు

**మెట్‌పల్లి, ఏప్రిల్ 28 (నినాదం):** మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు, నాయకులతో మంగళవారం పత్రిక సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం చేసిన నాయకత్వంపై ఆరోపణలను ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. అనంతరం కౌన్సిలర్ బత్తుల నరేష్ మాట్లాడుతూ, జెట్టి లింగంకు కాంగ్రెస్ పార్టీ దాదాపు 30 ఏళ్లుగా పలు కీలక పదవులు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఇప్పుడు నాయక త్వంపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. వెం టనే పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కౌన్సిలర్‌గా గెలిచి టీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి సభ్యత్వం కోల్పోయారని, అనంతరం ఇచ్చిన టికెట్లలో కూడా ప్రజా మద్దతు పొందలేక పోయారని విమర్శించారు. ఇతరులకు కూడా పార్టీ అవకాశాలు కల్పించినప్పటికీ వారు విజయం సాధిం చలేదని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, పార్టీ ఇచ్చిన పదవులను అనుభవించిన తర్వా త ఇప్పుడు ఆరోపణలు చేయడం సరికా దన్నారు.

హుజురాబాద్‌లో

## మున్సిపల్ ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో ఆందోళన

**హుజురాబాద్, ఏప్రిల్ 28(నినాదం ):** ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్ మున్సిపాలిటీ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఘటనకు వ్యతిరేకంగా, హుజురాబాద్ పురపాలక సంఘ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ ఆదేశాల మేరకు భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కరీంనగర్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్పొరేటర్ భర్త సానిటరీ ఇన్స్పెక్టర్‌పై దాడి చేయడం బాధాకరమని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, మున్సిపల్ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ రావుల భూపాల్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ నాయిని అశ్వినీ గాంధీ, సానిటరీ ఇన్స్పెక్టర్ దరిపల్లి కిరణ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, జూనియర్ సహాయకులు మహమ్మద్ వలీ పాషా, తిప్పారపు రాజయ్య, సానిటరీ మేస్త్రీ రొంటాల సుధీర్ తదితరులతో పాటు అన్ని విభాగాల మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. చివరగా, ప్రభుత్వ ఉద్యోగుల భద్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

## హిందూ ఐక్యతే జాతీయ సమైక్యతకు పునాది



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం) :** రేణుకుంట ఉపమండల కేంద్రంలో శ్రీ అభయాంజనేయ స్వామి సహిత జిటేశ్వర కాశి విశ్వనాథ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ తరిగొప్పుల శంకరయ్య మాట్లాడుతూ, హిందువుల ఐక్యత జాతీయ సమైక్యతకు, దేశ రక్షణకు బలమైన పునాది అని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు హిందూ ఐక్యత అత్యవసరమని, కుల, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి అందరూ ఒకే కుటుంబంగా భావించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపనకు వందేళ్లు పూర్తైన సందర్భంగా, దేశహితం, మాతృభూమి సేవ, హిందూ సంస్కృతి పరిరక్షణలో సంఘం చేసిన కృషిని గుర్తుచేశారు. 'పంచ పరివర్తన్' లక్ష్యంతో సామాజిక సమరసత, సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణ, పర్యావరణ రక్షణ, కుటుంబ విలువల బలోపేతం, పౌర బాధ్యతలపై అవగాహన పెంపొందించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా లెక్కల రమాదేవి, విష్ణుసేవానంద స్వామీజీ మాట్లాడుతూ, సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. దేశభక్తి, జాతీయ భావం పెంపొందించు కోవాలని, విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు హిందూ ఐక్యత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవరాజు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణన స్వీయ నమోదు పూర్తి చేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం) :** కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మంగళవారం తన కార్యాలయంలో జనగ ణన స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ము న్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు ఆయనను కలిసి వివరాలను నమోదు చేశారు. ఈ ప్రక్రి యను ఏసీపీ వేణు, పట్టణ ప్రణాళిక భవన పరిశీలకురాలు తేజస్విని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, దేశాభివృద్ధి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు జనగణన ము ఖ్యమని తెలిపారు.

# మిర్యాలగూడను ప్రధాన పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం

## మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 28 (నినాదం) :** మిర్యాలగూడను ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ప్రధాన పారిశ్రామిక హక్కుగా తీర్చిదిద్దుతాం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర చీప్ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తూ,ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా హైస్పీడ్ ట్రైన్లు,నేషనల్ హైవేలు,డ్రై పోర్ట్, మరియు గ్రీన్ ఫీల్డ్ హైవేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి తెలిపారు.శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 కోట్లతో 500 ఎకరాల్లో బుల్లెట్ ట్రైన్ హబ్బు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.దీనికి సంబంధించిన డీపీఆర్ ఈ ఏడాది నవంబర్ నాటికి పూర్తవుతుందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు కేవలం రాష్ట్ర భవిష్యత్తు,అభివృద్ధి నిధుల కోసమేనని అన్నారు.నేషనల్ హైవేపై నిర్మించాల్సిన ఫ్లైఓవర్ పనుల గురించి ఇప్పటికే కాంట్రాక్టర్లతో చర్చలు జరిపామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు.?హైవేపై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.?కేంద్ర ప్రభుత్వానికి కూడా అధికారికంగా లేఖ రాశామని,జాతీయ రహదారి పై ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని చెప్పారు.హరీష్ రావు, కేటీఆర్ పనిలేక ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చాలా బలంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో కూడా జిల్లాలోని 12 స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.?రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. వారి వెంట డిసిసి అధ్యక్షులు పున్న కైలాస్ నేత, చిలుకూరి బాలకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, కౌసర్లు నాయకులు తదితరులు ఉన్నారు.

## పెట్రోలు, డీజిల్ కొరత లేదు

### హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి



**హనుమకొండ, ఏప్రిల్ 28, (నినాదం):** జిల్లాలో పెట్రోలు, డీజిల్ ఇంధన కొరత లేదని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో పెట్రోలు, డీజిల్ కొరత లేనప్పటికీ బంకుల్లో వినియోగదారులు వేచి ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రామంలో పెట్రోల్, డీజిల్ కొరత అంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. పెట్రోల్,డీజిల్ కోసం బంకులకు వచ్చిన వినియోగదారులకు ఇంధనాన్ని సమకూర్చాలని పెట్రోల్,డీజిల్ బంక్ యజమానులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎండి, వాజీద్ అలీ, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, డి డబ్ల్యు ఓ విశ్వజ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళా, ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్, భారత్ పెట్రోలియం సేల్స్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ రాష్ట్ర ర్యాంకర్ ధరణికి సన్మానం



**మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (నినాదం):** మిర్యాలగూడ పట్టణంలోని 6వార్డ్ ఇంద్రమ్మ కాలనీ లేఔట్ వన్ కి చెందిన శివార్ల యాదగిరి జ్యోతి దంపతుల శివార్ల ధరణికి ఇటీవల ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో మిర్యాలగూడ మైనార్టీ గురుకులాల విద్యార్థిని బైపిసి గ్రూప్ సెకండ్ ఇయర్ లో 994/ 1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బిఎల్ఆర్ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, డిసిసి అధ్యక్షులు కైలాష్ నేత లు రాష్ట స్థాయి ర్యాంకర్ ధరణిని అభినందించి, సన్మానించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, 6వార్డ్ కౌన్సిలర్ ఆడోత్ అశోక్, 6వార్డ్ అధ్యక్షులు అంబటి వెంకటకృష్ణ, మిర్యాలగూడ యూత్ అసెంబ్లీ కన్వీనర్ నాగు నాయక్, కాంగ్రెస్ నాయకులు పల్లె భాస్కర్ కొట్టా ఆంజనేయులు నాయకులు, శ్రేణులు బిఎల్అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన





**అమరచింత, ఏప్రిల్ 28, (నినాదం):** వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు మెరుపు ధర్నాకు దిగిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు గాంధీ చౌరస్తాలో ఆందోళన. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. గన్ని బ్యాగ్స్ పంపిణీ చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. ధాన్యాన్ని కాంటాలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆరోపించారు. రైస్ మిల్లర్లు సకాలంలో లారీలు అన్లోడ్ కాకపోవడంతో కొనుగోలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. దాదాపు గంటన్నర పాటు చౌరస్తాలో రైతులు ఆందోళన చేయడంతో రోడ్డు కిరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. ఈ క్రమంలో రైతులకు బాసటగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు నిలిచారు ప్రభుత్వం అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు వెంటనే సంబంధిత అధికారులు కల్పించుకొని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎంతకీ ఆందోళన విరమించకపోవడంతో ఎస్సై జయన్న ఆందోళకానులతో మాట్లాడారు. పరిస్థితిని తహసిల్దార్ జీకే మోహన్ కు తెలపడంతో ఆయన అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడి చెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి ధాన్యాన్ని కొనుగోలు చేసేటట్లు కృషి చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

## కిషోర్ బాలికల సంఘాల అవగాహన సదస్సు



**చింతపల్లి, ఏప్రిల్ 28 (నినాదం):**మండలంలోని గడియ గౌరారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కిషోర బాలికల సంఘాల అవగాహన సదస్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ ఉపసర్పంచ్ ఆదిరాల్ల కృష్ణయ్య మాట్లాడుతూ, కిషోర్ బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత అంశాలపై తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, వారికి సరైన మార్గదర్శనం, ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థానాలను అధిరోహించగలరని ఆయన పేర్కొన్నారు. బాల్య వివాహాలను నిరోధించడం, బాలికల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అనంతరం సూపర్వైజర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ, కిషోర్ బాలికలు తమ తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలుగుతూ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. స్వీయ రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో వచ్చే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు వెంకటమ్మ, లక్ష్మీ, వీణ,ఆశా వర్కర్లు ,కిషోర బాలికలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన



**కోదాడ,ఏప్రిల్ 28(నినాదం):** మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్నేహ నర్సింగ్ కాలేజీలో నర్సింగ్ విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ, విద్యార్థినులు ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యా దశలో సరైన అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. మంచి--చెడు అలవాట్ల ప్రభావాలపై వివరించారు.ప్రొటెక్షన్ ఆఫీసర్ మీరా మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత, విద్య భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. చెడు స్నేహాల ప్రభావం, తల్లిదండ్రులు--ఉపాధ్యాయులతో ప్రవర్తనపై సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలు, పోస్కో చట్టం, బాలల రక్షణ సేవలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## హోమంతాలపల్లిలో జల జీవన్ మిషన్ వేడుకలు



**చింతపల్లి, ఏప్రిల్ 28 (నినాదం):** ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "హర్ ఘర్ జల్" కార్యక్రమంలో భాగంగా మండలంలోని హోమంతాలపల్లి గ్రామంలో మంగళవారం జల మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి ట్యాంకును మామిడి తోరణాలు, పూలు, కొబ్బరి మట్టలతో అందంగా అలంకరించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ట్యాంకు వద్దకు చేరుకుని జల మహోత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డబ్ల్యూఎస్. డి ఇ ఇ. నగేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి కృష్ణా నది జలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది పర్యవేక్షణలో భాగంగా ప్రత్యేకంగా ఏడు రిజిస్టర్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా గ్రామస్తులు వెంటనే రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేసుకోవాలని, ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమం అనంతరం ఆమె కిషోర బాలికల తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని, బాలికలు విద్యతో పాటు సామాజిక అవగాహన కూడా పొందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఈ కాంపల్లి శేఖర్, ఉపసర్పంచ్ మంజుల అల్వాల్, అంగన్వాడి ఉపాధ్యాయులు ఎం. జయమ్మ, పద్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పీడియస్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టివేత



**చింతపల్లి, ఏప్రిల్ 28 (నినాదం):** అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వాహనాన్ని మంగళవారం పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ముత్యాల రామ్మూర్తి తన సిబ్బందితో కలిసి విరాట్ నగర్ కాలనీ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రంగారెడ్డి జిల్లా, మాడుగుల మండలం, అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల శ్రీకాంత్ అనుమానాస్పదంగా అశోక్ లేలాండ్ ట్రాలీలో బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు.వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో సుమారు 40 బస్తాల పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

## గోమాతపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని తహసీల్దార్‌కు వినతి



**అమరచింత, ఏప్రిల్ 28, (నినాదం):** రాష్ట్రంలో రాను రాను గోవుల సంఖ్య తగ్గిపోతుంది అని ఆత్మకూర్ హిందూ వాహిని కమిటీ మండల ఉపాధ్యక్షులు పోలేల రాజు, సభ్యులు బోరెల్లి రాము ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద వారు గోవులను రక్షించాలని నిరసన వ్యక్తం చేశారు. గోవులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని గోసంతతిని కాపాడి సంరక్షించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసిల్దార్ అచ్యుతారెడ్డికి అందజేశారు. ఇటీవల రాష్ట్రంలో గోవులు అంతరించిపోవడానికి గల కారణాన్ని విచారించి గోహత్యకు పాల్పడుతున్న వ్యక్తులను, గోవులను తరలిస్తున్న ముఠాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల హిందూ వాహిని కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పౌరుడి చేతితో వజ్రాయుధం

## రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 28(నినాదం):** ప్రభుత్వ అధికార యంత్రంగాలలో పారదర్శకత, బాధ్యతను కలిగి ఉండేందుకు సమాచార హక్కు చట్టం పౌరుడి చేతిలో వజ్రాయుధం లా పనిచేస్తుందని రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం పై పౌర సమాచార అధికారులు, అధికార యంత్రాంగాలకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్య దేశంలో సమాచారం ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, అయితే అలాంటి సమాచారాన్ని అందించే బాధ్యత పబ్లిక్ అథారిటీలపై ఉందని అన్నారు. ప్రతి పబ్లిక్ అథారిటీ పారదర్శకంగా, బాధ్యతగా సేవలు అందించేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఇందుకుగాను ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని చాప్టర్లు, సెక్షన్లు, ఉపవిభాగాలు తదిత అంశాలపై ఆయా సెక్షన్ల వారిగా కూలంకషంగా వివరించారు.

సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసే అధికారం కూడా ఉందని తెలిపారు.అధికార యంత్రాంగాలు పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1 )బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చే లా అధికార యంత్రంగాలు తయారు కావాలని, ముఖ్యంగా పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు ,నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4 (1) బి రిజిస్టర్ లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసే విధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. పౌరులు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని అన్నారు .రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం కింద 1,20,000 దరఖాస్తులు వస్తే లక్ష మందికి సమాచారం ఇచ్చిన ఘనత రాష్ట్రానిదని అన్నారు . 15000 నుండి 20వేల వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని తెలిపారు. గడచిన పది నెలల్లో 15 వేల కేసులను రాష్ట్ర సమాచార కమిషన్ పరిష్కరించినట్లు ఆయన వెల్లడించారు . కావాలని సమాచారం ఇవ్వని 15 మంది పౌర సమాచార అధికారులపై చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని ,ఇప్పటివరకు 18 జిల్లాలను రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని,4,5 సంవత్సరాలకు పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని, ప్రస్తుతం కమిషన్ వద్ద 10 వేల కేసులు పెండింగ్ లో ఉన్నాయని , మే 15 నాటికి రెవెన్యూ, మున్సిపల్ తప్ప తక్కిన అన్ని కేసులు పరిష్కరిస్తామని చెప్పారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐవోలు ,అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మూడవ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తులు అడిగే సమాచారం ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వివరాలనుతెలియజేశారు. ఈకార్యక్రమంలో సమాచార కమిషనర్ భోరెడ్డి అయోధ్య రెడ్డి, కమిషనర్ పీవీ. శ్రీనివాసరావు,రాష్ట్ర సమాచార కమిషనర్ మోషిన్ పర్వీన్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్ట్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిఎఫ్ఓ రాజశేఖర్, ఆర్ డి ఓ లు, జిల్లా అధికారులు, పౌర సమాచార అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి





## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 28 (నినాదం):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, చెకప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రతి రోజు ఇన్‌పేషెంట్స్, ఔట్‌పేషెంట్స్ సంఖ్య, గర్భిణీల చెకప్‌లు, అందుబాటులో ఉన్న పరీక్షలు, ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలను దివ్యాంగులను ఆదుకుంటేనే ఆత్మ సంతృప్తి

## తెలంగాణ వికలాంగుల హక్కుల జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ



**జవహర్ నగర్, ఏప్రిల్ 28 (నినాదం):** పేదలను దివ్యాంగులను ఆదుకుంటేనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని తద్వారా సమాజానికి ఎంతో కొంత చేసిన వారము అవుతామని తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మెరుగు శివకృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన ఆశ అనే పేదింటి అమ్మాయి పుట్టుకతోనే చేయి చిన్నగా ఉండడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. సమస్యను గుర్తించిన శివకృష్ణ భారత వికాస పరిషత్ వికలాంగుల పునర్వసతి ట్రస్ట్ కేంద్రాన్ని సంప్రదించగా ఆశకు ఆర్టిఫిషియల్ రైట్ హ్యాండ్ అందేలా చర్యలు తీసుకున్నారు. శివ కృష్ణ చొరవతో జరిగిన ఈ సహాయం వల్ల ఆశ జీవితంలో కొత్త ఆశను వెలుగు చూసింది. ఫలితంగా రోజువారి పనులను సులభంగా చేసుకునే స్థితికి వచ్చింది. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ భారత వికాస ట్రస్ట్ కేంద్రం మేనేజర్ నరేంద్ర తదితరుల కృషి వల్లనే ఈ గొప్ప సహాయం చేయగలిగామని తెలిపారు. సమాజంలో ఎవరైనా దాతలు ముందుకు వచ్చి దివ్యాంగులకు సహాయం చేయాలని కోరారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య ఉపాధి వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### అత్యవసర సేవల కోసం ఆస్పత్రులకు..

## డీజిల్ సరఫరా చేయాలి

### డాక్టర్ ముప్వా రామారావు

**మిర్యాలగూడ ఏప్రిల్ 28(నినాదం) :** ఆసుపత్రులను అత్యవసర విషయం గా భావించి డీజిల్ ను ప్రత్యేకంగా సరఫరా చేయునట్లు అధికారులు చొరవ చూపాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ముప్వా రామారావు కోరారు. మంగళవారం ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. వెంటిలేటర్ పై ఉన్న పసి పిల్లలకు, కార్డియాలజీ విభాగంలోని కేతలాగ్ మిషన్ లకు జనరేటర్ తప్పనిసరి అన్నారు. జనరేటర్లు నడవడానికి డీజిల్ కావలసి ఉందని చెప్పారు. ఐసీయూ లో ఉన్న పేషెంట్లకు, ఆక్సిజన్ అందజేయడం, ఆపరేషన్ థియేటర్లో శస్త్ర చికిత్సలు చేయు సమయంలో జనరేటర్ల వినియోగం అవసరమవుతుందని అన్ని ఆసుపత్రిలోనూ జనరేటర్లు పనిచేస్తున్నాయని అన్నారు. జనరేటర్లు పనిచేయకపోతే రోగుల ప్రాణాలు మీదికి వస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కొరత ఉందని వినియోగదారులకు ఇంధనం సరఫరా కావడం లేదని అన్నారు. ఈ క్రమంలో ఆసుపత్రుల జనరేటర్లకు కూడా డీజిల్ దొరకడం లేదని చెప్పారు. పెట్రోల్ బంక్ ల యజమానులు ఈ విషయమై చర్చించి ఏదో ఒక పెట్రోల్ బంకులో అత్యవసర సేవలకు గాను ఆసుపత్రులకు డీజిల్ అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహణ



**చింతపల్లి, ఏప్రిల్ 28(నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుల అవగాహన కోసం "రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం మంగళవారం మండలంలోని నెల్వాల్ పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త ఆర్. సుశీల మాట్లాడుతూ రైతులు తక్కువ యూరియా వాడటం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అవసరమైనంత మేరకే రసాయనాలు వినియోగిస్తూ, పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని వివరించారు.అదేవిధంగా వరి పరిశోధనా విభాగానికి చెందిన శాస్త్రవేత్త డా. బి. లక్ష్మీ ప్రసన్న మార్కెట్లో గిరాకీ ఉన్న పంట రకాలపై అవగాహన కల్పించారు. సాగు నీటిని ఆదా చేయడం ద్వారా భావితరాలకు నీటి వనరులను అందించవచ్చని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏ. నాగేశ్వరి రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ఉప్పరపల్లి సర్పంచ్ ఎం. మెండే వెంకటయ్య మాట్లాడుతూ రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఆత్మ కమిటీ చైర్మన్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం మాట్లాడుతూ రైతులు అవసరమైనంత మేరకే యూరియా వినియోగిస్తూ, స్వయంగా విత్తనోత్పత్తి చేసుకోవాలని సూచించారు.మండల వ్యవసాయాధికారి శ్రావణ కుమారి మాట్లాడుతూ తక్కువ యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ వ్యవసాయాధికారి ఎం. హేమలత, విస్తరణ అధికారి కుమారి ప్రియాంక , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
చిన్న పిల్లల హక్కుల భంగన సమస్య వస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి
విద్యా నాణ్యత పెంపుతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి
సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్





**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్-28(నినాదం):** బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,బాలల సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సలయ్, అంగన్వాడీ సేవలు,ప్రీ-ప్రైమరీ విద్య, బాలల సదనాల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం,సురక్షిత వాతావరణం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. ఏ చిన్నారికి అయినా సమస్యలు ఎదురైతే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదివే సామర్థ్యం ఓ.ఆర్.ఎఫ్,పఠన అవగాహన ఆర్.సి, వంటి సూచికల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు సమతుల్య పోషకాహారం అందిస్తూ, వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆర్.బీ.ఎస్.కే కార్యక్రమం ద్వారా పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ,ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణ చికిత్స అందిస్తున్నామని, అవసరమైతే శస్త్రచికిత్సలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాల రహిత గ్రామంగా ఎంపికైన పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలనలో గ్రామ ప్రజలు చూపిన చైతన్యం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేత
జర్నలిజం రంగానికి తీరని లోటు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





**మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (నినాదం):** ఉప ముఖ్యమంత్రి సీపీఆర్ఓ, సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూదన్ అకాల మరణం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్ నగర్‌లో గల మధుసూదన్ నివాసానికి చేరుకున్న మంత్రి మధుసూదన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామ ర్శించిన వారిని ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని తక్షణ సాయంగా కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం పరంగా మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీఇచ్చారు. అదేవిధంగా మధుసూదన్ మృతదేహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ లుశంకర్ నాయక్, సత్యం, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస నేత, మాజీలు ఎమ్మెల్యే న లమోతు భాస్కరరావు, చిరుమర్రి లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, తదితరులు మధుసూదన్‌కు నివాళులు అర్పించారు. మధుసూదన్ ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన జర్నలిస్ట్ అని, మధుసూదన్ సేవలను మంత్రి కొనియాడారు. ఆయన మరణం జర్నలిజం రంగానికి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. మధుసూదన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 28 (నినాదం):** క్రీడలతోనే మానసిక , శారీరక ఉల్లాసం అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. సింగరేణి సంస్థ ప్రతీ యేట నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణా కార్యక్రమాల్లో భాగం గా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఉద్యోగుల పిల్లలకోసం ఈ సారి ఐదు విభాగాల్లో వేసవి ఉచిత క్రీడా శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నారు. 25 రోజులు కొనసాగే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ఉద్యోగులు పిల్లలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. సింగరేణి కల్పిస్తున్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాల్లో క్రీడాకారుల ప్రోత్సాహం ఒకటి అన్నారు. ప్రస్తుతం చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారి ఆటపాటలు, క్రీడలు , ఔట్ డోర్ గేమ్స్ను పూర్తిగా మరిచారు...ఈ వేసవి సెలవుల్లో పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచడంలో ఈ శిక్షణా శిబిరాలు ఎంతగానో మేలు చేస్తాయి అన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు భవిష్యత్లో ఆయా క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం . సత్యనారాయణ, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు , డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు

అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం) :** జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లాలో ఇంధన లభ్యతపై తహసిల్దార్లతో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వెబ్ఎక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం తోపాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఇంధన అవుట్ లెట్ డీలర్లు, ఎస్ ఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలు, రవాణా, అత్యవసర సేవలకు ఇంధన కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే పెట్రోల్ బంకుల వద్ద తగినంత నిల్వలు ఉండేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని, రోజువారీ విక్రయాలు, నిల్వలపై సమగ్రంగా పరిశీలించాలని చెప్పారు. ఎలాంటి కృత్రిమ కొరత సృష్టించే చర్యలను తీవ్రంగా పరిగణించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.పొరుగు రాష్ట్రాల నుంచి అనవసరంగా వాహనాలు వచ్చి ఇంధనాన్ని వినియోగించకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించారు. అదేవిధంగా ప్రజల్లో అపోహలు తొలగించే విధంగా మీడియా ద్వారా సరైన సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్.ఐ.ఆర్‌పై సమీక్షించిన కలెక్టర్




**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 28, (నినాదం):** కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శక మైన ఓటరు జాబితాలను రూపొందించ డానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్. ఐ.ఆర్) ప్రక్రియ కు శ్రీకారం చుట్టిందనీ, జిల్లాలో ఈ ప్రక్రియను మూడు రోజుల్లో వేగం చేసి 85 శాతం మ్యాపింగ్ చేయా లని జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను తో కలిసి కలెక్టర్ ఎస్. ఐ.ఆర్, సాదా బైనామా పై తహసీల్దార్లు, డీటిలు, సూపర్ వైజర్లు, ఏ ఈ ఆర్ వో లతో సమీక్ష జరిపారు. ఎస్. ఐ ఆర్ ప్రక్రియను చాలా పారదర్శకంగా చేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో 85 శాతం పూర్తి చేయాలని ఆమె తేల్చి చెప్పారు. లేని పక్షంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పై తహసిల్దార్ల తో చర్చించారు. జీవో 74, 76 ప్రకారం సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 2075 సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, 2674 సర్వే నంబర్లను విచారణ చేసి ఈ నెలాఖరు నాటికి ఆయా దరఖాస్తులను అనుమతించాలని, లేదా తిరస్కరించాలని, ఆయా దరఖాస్తులను అనుమతించిన, తిరస్కరించిన కారణాలను స్పష్టంగా పేర్కొనాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తహసిల్దార్ల కు సూచించారు. చివరగా భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై చర్చించి వాటిని క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

N NADAM CINEMA

## వరుస సినిమాలతో బాలయ్య బిజీ

కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం




నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ స్జబెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య-గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య-గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది. మరి బాలయ్య - కొరటాల శివ మూవీ ఎప్పుడు ఎలా ప్రేక్షకులను పలకరిస్తుందో చూడాలి.



## లుక్ టెస్ట్ పూర్తయ్యింది

చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి - బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.

## మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ



దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.






## మా ఇంటి బంగారం ప్రమోషన్స్

ఇంకా మొదలు పెట్టని నటి సమంత

ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తు న్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడు స్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమం త నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహి స్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటి వరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమో రుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్- నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు.

## పండుగాడి జర్నీకి 20 ఏళ్లు

పోకిరీ విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు




తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787